# సమర్థ సద్గురు

## ఆధ్యాత్మిక మాసపత్రిక

శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమం - 522508, గుంటూరు జిల్లా
ఫోన్ (0863) 2293645, 2293862, 2293206.
web : www.mathaji-babuji.org samardhasadguru@rediffmail.com

**సంపాదక వర్గము**
మిస్. పి. ఇందిరాదేవి
డా॥ యమ్. స్వర్ణముఖి
సి.వి. రమణ బాబు
పి.యస్.ఆర్.కె. ప్రసాద్
కె. మురళీ మోహన వర్మ

సంపుటి 40 సంచిక 2
పేజీలు 44
అక్టోబర్ 2020

5సం॥ల చందా రూ. 250
2సం॥ల చందా రూ. 120
సంవత్సర చందా రూ. 60
విడిప్రతి వెల...... రూ. 5

బ్యాంక్ డ్రాఫ్టు Y.S.C.K.P.M చారిటబుల్ ట్రస్ట్, A/C సమర్థ సద్గురు ,పేరుతో డ్రా చేయండి.
M.O, బ్యాంక్ డ్రాఫ్టు పంపవలసిన చిరునామా
మేనేజరు
సమర్థ సద్గురు మాగజైన్
శ్రీకాళీగార్డెన్స్ - 522508, నంబూరు
గుంటూరు జిల్లా

Printed and published by C.V. Ramana Babu on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh and Published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, Editor PALURI SIVA RAMA KALI PRASAD

**ఈ సంచికలో** ............................ ....... **పేజీ**

దాశరథీ శతకము ....................................4
శ్రీబాబూజీ ఉవాచ.................................... 5
అమ్మమాట.................................... 8
పుత్ర ప్రేమ ....................................11
జీవితం ఒక నాటకం .................. .................13
మా ఆశ్రమం - శ్రీకాళీవనాశ్రమం.........15
రామాయణంలో స్త్రీ పాత్రలు......................17
బాబూజీతో అనుభవాలు ...........................19
ధ్యాస .................. ................. ..................... ..................21
శ్రీదేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు.......25
ఎవరు అమరుడు? .... ......... ...... ..................28
శ్రీబాబు దివ్యవాణి .................. ..............................30
కైవల్యోపనిషత్ ... ......................................32
శ్రీకాళీగార్డెన్స్ కార్యక్రమాలు..............................34
గౌతమ మహర్షి ....... ........................ ......................35
డొక్కా సీతమ్మగారు ........ ..................................37
ఎన్నేళ్ళుంటామో ................. .................................38
సమర్థ సద్గురునాధుని దివ్యచరిత్ర.....39
విష్ణు కథలు ........ ............................ .....................41

# దాశరథీ శతకము

- భద్రాచల రామదాసు

**అగణిత సత్యభాష, శరణాగతపోష, దయాలసజ్జరీ**
**విగత సమస్తదోష పృథివీసురతోష, త్రిలోక పూతకృ**
**ద్గగన ధునీ మరంద పదకంజ విశేష మణిప్రభా ధగ**
**ద్ధగిత విభూష భద్రగిరి దాశరథీ కరుణాపయోనిధీ.**

తాత్పర్యం - సత్యము మాట్లాడువాడవు, శరణన్న వారిని రక్షించువాడవు, దయచేత పాపములను పోగొట్టువాడవు, బ్రాహ్మణులను సంతోషింప జేయువాడవు, గంగా నది పుట్టిన పాదపద్మములు గలవాడవు, మణులచే నిగనిగ మెరయు సొమ్ములు కలవాడవు ఓ భద్రాచల రామా!




*శ్రీబాబుకు ఎరుపు రంగు ఎందుకు ఇష్టం?
*అన్నిదానాలకు మించిన దానమేది?
*గోదావరికి ఆ పేరు ఎందుకు వచ్చింది?
*ఎవరికి ప్రదక్షిణం చేస్తే భూప్రదక్షిణం చేసినట్లవుతుంది?
*కర్మలో అకర్మ, అకర్మలో కర్మ అంటే ఏమిటి?
*అన్నిటికన్న మిన్న అయిన ఆనందం దేనిద్వారా కలుగుతుంది?
*అద్వైత ప్రయోగశాల ఏది?
*శ్రీకాళీవనాశ్రమము ఎవరి స్వరూపము?
*అక్బరు మీరాను దర్శించి ఎవరి కృపను పొందాలనుకున్నాడు?

***సమాధానాలు లోపలి పేజీలలో............................***

# శ్రీబాబూజీ ఉవాచ

- కీ.శే. పరాశర ప్రసాద్

19-5-1980

శ్రీ బాబూజీ సుమారు ఆరురోజుల క్రితం మాకు ఒక సమస్య ఇచ్చారు. సమస్య ఇస్తూ "మీరు ఎల్లప్పుడూ ఈ సమస్య గురించి ఆలోచిస్తుండటం వలన మీరు భవబంధములనుండి విముక్తులై, నేను పొందే ఆనందాన్ని మీరుకూడా పొందాలని నేను ఆకాంక్షిస్తున్నాను" అన్నారు.



ఆ సమస్య ఏమంటే "ఇహాముత్ర ఫలభోగ వైరాగ్యము కల్గి, శమ దమాది షట్క సంపత్తి కల్గిన మహాత్ముల స్థితి ఎలా ఉంటుంది? ఈ ఆధ్యాత్మిక సంపద కలిగిన వారివలన ఏమన్నా ఉపయోగము వుందా? వివరంగా అందరిని వ్రాయమన్నారు. ఆ రోజు ఈ విషయాన్ని గూర్చి చర్చ వస్తుంది.

ఈరోజు బాబు ఉదయం వాకింగ్ చేసిన తర్వాత అంతా కూర్చున్నాము. శ్రీబాబు ఇచ్చిన సమస్య గూర్చిన వ్యాసాలు చదివాము. అంతా విన్న తర్వాత శ్రీ బాబు మాట్లాడుతూ "మనదేశంలో ఆధ్యాత్మిక సంపద కల్గిన మహాత్ములు ఎందరో ఉద్భవించారు. ఆ మహాత్ములను ఆశ్రయించి, వారి ఆశీస్సులతో మనదేశాన్ని పరిపాలించిన అనేకమంది చక్రవర్తులు ధర్మస్థాపన చేసారు.

అక్బరు చక్రవర్తి మొగల్ సామ్రాజ్యాధినేత. ఆయనవద్ద తాన్‌సేన్ అనే ఆస్థాన సంగీత విద్వాంసుడు ఉండేవాడు. తాన్‌సేన్ ఒకనాడు అక్బరునకు పొరుగు రాజ్యంలో ఉండే భక్తమీరా గురించి చెప్తాడు. భగవానుడు ఎప్పుడు ఎవరిని ఎలా అనుగ్రహిస్తాడో ఎవరు చెప్పగలరు? అది వారివారి పూర్వజన్మ సంస్కారాన్ని బట్టి ఉంటుంది. మీరాదేవి శ్రీకృష్ణ

పరమాత్ముని ఆరాధిస్తూ, గానంచేస్తూ, నృత్యంచేస్తూ భక్తి పారవశ్యంలో తన్మయత్వం పొందే మహాత్మురాలు అని తాన్‌సేన్ అక్బరు చక్రవర్తికి చెప్పాడు.

అక్బరు చక్రవర్తి రసికప్రియుడు. అయినా అతని జన్మ సంస్కారం పండింది. కాబట్టి మీరాదేవి గురించి తాన్‌సేన్ చెప్పినది విన్న తర్వాత, ఆ మహాత్మురాలు శత్రురాజ్యంలో ఉన్నప్పటికి ఎలాగైనా ఆవిడను దర్శించి అల్లా కృప పొందాలని అనుకున్నాడు. అటువంటిభావం కల్గటానికి కారణం ఏమిటి? అక్బరు చక్రవర్తిలో ఏ శక్తి ఆ భావాన్ని కలగజేసింది? జన్మజన్మలనుంచి రాశీభూతమైన పూర్వజన్మ సంస్కారమే.

మనము చేసిన సాధన వృథాపోదు. అదే మనవెంట వచ్చేది. అక్బరు చక్రవర్తికి ఎలాగైనా మీరాదేవిని దర్శించాలి అనే తపన కల్గింది. అయితే మీరాదేవి శత్రురాజ్యంలో ఉంది. ఆమెను దర్శించటం ఎలా సాధ్యపడుతుంది? అక్బరు చక్రవర్తిలోని తపనే, ఆయనకు ఒక ఆలోచన స్ఫురింపజేసింది.

అక్బరు చక్రవర్తి, తాన్‌సేన్‌లు సన్యాసుల వేషం వేసుకుని ఆ మహాత్మురాలిని దర్శించటానికి నిశ్చయించుకున్నారు. చక్రవర్తి తన పదవి, హొదా అన్నీ వదలుకొని సన్న్యసించటం అంటే సామాన్య విషయమా? అది అక్బరు చక్రవర్తి పూర్వజన్మ పుణ్యఫలము.

అక్బరు చక్రవర్తి, తాన్‌సేన్‌లు మీరాదేవిని సందర్శించటానికి వెళ్ళేసరికి మీరాబాయి శ్రీ కృష్ణభగవానుని కీర్తనచేస్తూ భక్తి పారవశ్యంలో ఉంది. ఆమె మనస్సు శ్రీకృష్ణ పరమాత్మలో లీనమైంది. తన్మయత్వంలో ఉద్భవించే గానామృతాన్ని ఎవరు వర్ణించగలరు? ఆ గానామృతాన్ని విన్న అక్బరు, తాన్‌సేన్‌లు పరవశించి పోయారు. అక్బరు చక్రవర్తి హృదయంలో ఆమె పాదపద్మాలు నిలిచిపోయాయి. అజ్ఞానము తొలగిపోయి ఆనందంలో ఓలలాడుతూ భక్తి పారవశ్యంలో మునిగిపోయాడు.

అక్బరు చక్రవర్తి వెంటనే మీరాబాయి చరణారవిందములకు నమస్కరించి, అత్యంత విలువైన వజ్రములతో కూడిన హారమును మీరా ఆరాధించే శ్రీ కృష్ణ పరమాత్మునికి సమర్పించాడు.

తన్మయత్వంలో అక్కడున్నవారంతా అక్బరు శ్రీకృష్ణ పరమాత్మకి

సమర్పించిన హారము విలువ గురించిగాని, సమర్పించిన వ్యక్తిని గురించిగాని, ఆలోచించే స్థితిలో లేరు. వారి హృదయాల్లో మీరాబాయి పాదపద్మాలే నిలిచాయి.

తాన్‌సేన్ స్వతహాగా మంచి గాయకుడు. కాబట్టి అతడు కూడా మీరా చేసే గానంలో లీనమై తానెక్కడున్నదీ కూడా మరచాడు. సన్యాసుల వేషంలో ఉన్న అక్బరు చక్రవర్తినిగాని, తాన్‌సేన్‌నుగాని గుర్తించిన వారులేరు. అదే భగవంతుని లీల. ఎంతమందో గూఢచారులు ఉన్నారు. అయితేనేం?

అక్బరు చక్రవర్తి, తాన్‌సేన్‌లు ఇరువురు తమపని ముగించుకొని తమ రాజ్యానికి తరలి వెళ్ళారు. అక్బరు ఆ తన్మయత్వంలో ఆరునెలలు వున్నాడు. మరి ఆ సమయంలో ఆ రాజ్యాన్ని పరిపాలించినదెవరు? అక్బరు చక్రవర్తిలో మేల్కొన్న ఆధ్యాత్మిక శక్తియే పాలించింది. ఇట్టి శక్తిచేత పాలింపబడిన సామ్రాజ్యస్థితి ఎలా ఉంటుంది? అంతా ధర్మమే కదా?" అన్నారు శ్రీ బాబు మళ్ళీ.

## సమర్థ సద్గురు మాస పత్రిక సభ్యులకు విజ్ఞప్తి

ఈ క్రింద తెలిపిన సభ్యుల మాస పత్రిక చందా అక్టోబర్, నవంబర్ 2020 మాసాలలో ముగుస్తుంది. పత్రిక నిలిపివేసే ముందుగా మీ సభ్యత్వాన్ని పునరుద్ధరించుకోనండి.

***అక్టోబర్ 2020:*** AS 1109, 1141, 5708, 6575, 6767, 6867, 6953, 7137, 7176, 7178, 7182, 7183, 7389, 7908, 7912, 7920, 7173, 8392, 8395, 8422, 8423, 8428, 8430 to 8432, 8434, 8435, 8437 to 8440, 8442, 8444, 8445, 8447 to 8451, 8453 to 8455, 8457 to 8461, 8464 to 8467, 8469

***నవంబర్ 2020:*** AS 3922, 5308, 6309, 6639, 7186, 7609, 7923, 7924, 7945, 7946, 8474, 8475, 8477, 8480, 8484, 8486, 8487, 8488

# అమ్మమాట

-జపమాల ప్రసాద

## మాయను జయించడం ఎలా?

మాయను గురించి అప్పుడూ మాట్లాడుకున్నాం; ఇప్పుడూ మాట్లాడుకుంటున్నాం; రేపు కూడా మాట్లాడుకుంటాం. ద్వాపర యుగంలో శ్రీకృష్ణుడు మాయను గురించి చెప్పాడు. అంతకు ముందు త్రేతాయుగంలోనూ దాని గురించి చెప్పుకున్నారు. అప్పుడూ, ఇప్పుడూ, ఎప్పుడూ మాయని గురించే చెప్పుకుంటున్నాం.

అసలు 'మాయ' అంటే ఏమిటి? యా - ఏది, మా - లేదో అది మాయ. 'యా మా సా మాయా' అని సంస్కృత అర్థం. మరి లేనిదాని గురించి ఇంత ఎందుకు చెప్పుకుంటున్నాం? అన్నింటినీ తీసుకువెళ్ళి మనం ఆత్మవస్తువుకు జత పరుస్తున్నాం. ఆత్మవస్తువు నిర్వికారం, నిరంజనం. అది కదలనటువంటిది; మార్పు లేనటువంటిది. ఏ గుణమూ లేనటువంటిది. మరి అటువంటి నిర్గుణమైన విషయం గురించి, మనో వాక్కులకు అందనటువంటిది, ఇంద్రియాతీతమైనది అయిన దానిని గురించి ఇంద్రియ సహితులమైన మనం ఎలా తెలుసుకోగలం? మనకున్నది ఈ పది ఇంద్రియాలే కదా! మరి మనం త్రిగుణములతో కూడుకున్న మాయచేత ఆవరింపబడినాము కదా! మాయకు అతీతమైన ఆ పరమాత్మను, మాయకు లోబడిన మనం ఎలా తెలుసుకోగలం? కానీ, నిర్హేతుక జాయమానా కరుణాకటాక్షం కలిగినవాడాయన కావడం వలన, జీవులపై అపారమైన కరుణ కలిగి, తన మాయను తానే స్వీకరించి, తాను కూడా ఇంద్రియ సహితుడై, ఉద్భవించాడు.



**అజోపి సన్నవ్యయాత్మా భూతానామీశ్వరోపిసన్।**
**ప్రకృతిం స్వా మాధిష్ఠాయ సంభవామ్యాత్మ మాయయా॥**

(భ.గీ. 4/6)

'నేను పుట్టుక లేనివాడినయి వుండియు, నాశ రహితుడను అయి,

పిపీలికాది బ్రహ్మ పర్యంతం సమస్త భూతములకు నియామకుడనై వుండి, త్రిగుణాత్మకమైన నా మాయను అధిష్ఠించి, నా ఇష్టానుసారంగా నేను ఉద్భవిస్తున్నాను' అని స్వామి చెప్పుకున్నాడు.

బ్రహ్మమనే ఏకవస్తువు దగ్గర 'మాయ' అనేది వుంటేనే చెప్పుకో గలుగుతున్నాం. అయితే, ఇక్కడ ఒక చిక్కు వుంది. ఈ మాయ లేని దానిని వున్నట్టుగా తోపింపజేసి, అసలు వస్తువుని మరచిపోయేటట్లు చేస్తుంది. భగవంతుడు ఎంత అనాదియో, మాయ కూడా అంత అనాది. మరి అటువంటి మాయను దాటటం ఎలా అని అడిగితే దానికీ ఆ గీతా చార్యుడే ఇలా శెలవిచ్చాడు ....

**దైవీ హ్యేషా గుణమయీ మమ మాయా దురత్యయా ।**
**మా మేవ యే ప్రపద్యన్తే మాయా మేతాం తరంతి తే ॥**

(భ.గీ. 7/14)

'త్రిగుణాత్మకమైన నా మాయ దైవీ సంబంధమైనది. అది సామాన్యులకు దాట శక్యం కాదు. కానీ, ఎవరు నన్ను శరణు పొందుతారో, వారు ఈ మాయను శీఘ్రంగా దాటగలరు' అన్నారు స్వామి.

మనలను తరింపజేయడానికి అవతరించిన మహాపురుషులు సద్గురుమూర్తి శ్రీ బాబూజీ మహరాజ్. ఇక్కడ శ్రీబాబు బిడ్డలు కాని వారెవరూ లేరు. 'నేను నా తపశ్శక్తినంతా ఇక్కడ నిక్షిప్తం చేశాను. ఆశ్రమం నా స్వరూపం. ఎన్నో జన్మల పుణ్యం రాశీభూతమైతే తప్ప ఆశ్రమవాసం లభ్యం కాదు. ఆశ్రమ సేవ చేసుకుంటే నా సేవ చేసుకున్నట్లే. తన కంట్లో ధూళిని తీసుకోకుండా, ఎదుటివాడి కంటిలోని నలుసును తీయడానికి చూడకండి. ఎదుటి వారి తప్పులు చూడకండి. ఆత్మ విమర్శ చేసుకోండి. అందరిలోనూ మంచినే చూడండి, మంచినే గ్రహించండి. అందరికీ మంచినే చేయండి' అని శ్రీబాబు శెలవిచ్చారు.

ప్రపంచమంతా అట్టుడుకిపోతోంది. కానీ, ఇక్కడ ఇంత ప్రశాంతంగా ఎలా వుంది? కరోనా వ్యాధి ఇక్కడకు కూడా తొంగి చూస్తోంది. కానీ, మనం భగవన్నామాన్ని మరువనంత వరకూ, గురుమూర్తి యందు సడలని విశ్వాసం కలిగి వుండి, సామాజికంగా మనం తీసుకోవలసిన జాగ్రత్తలు మనం తీసుకుంటూ, సాధ్యమైనంత వరకూ బయట ప్రపంచం వైపుకు పరుగులు పెట్టే కాళ్ళను (మనస్సుని)

అదుపులో వుంచుకుని, మిత భాషణ, మిత వ్యవహారం చేస్తూ, శారీరక పుష్టినిచ్చే ఆహారం తీసుకుంటూ, అన్నిటికంటే ముఖ్యంగా మానసిక పుష్టిని, బలాన్ని, ప్రశాంతతని, ఉల్లాసాన్ని కలిగించే భగవన్నామ స్మరణ, భగవత్తత్వ విచారణ అవిశ్రాంతంగ, అనవరతం చేసిననాడు ఏ వ్యాధి మనలను ఏం చేయగలదు?

శ్రీగురుపాదుకలు సమస్త లోక ప్రజలకూ అఖండ ఆయురారోగ్య ఐశ్వర్య సుఖశాంతులను ప్రసాదించి సర్వదా కాపాడుగాక!

## హైదరాబాదు శాఖలో కార్యక్రమాలు

**అక్టోబర్ 2020**

1 గురు - అధిక ఆశ్వీయుజ పౌర్ణమి సా॥ 5-30 గం. సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన

12 సోమ - శ్రీగురుదశమి - సా॥ 5-30 గం. సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన

24 శని - దుర్గాష్టమి, మహర్నవమి - ఉదయం 11గం. శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన

25 ఆది - విజయదశమి - ఉ ॥ 11 గం. శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన

31 శని- ఆశ్వీయుజ పౌర్ణమి - సా॥ 5-30 గం. సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన

**నవంబర్ 2020**

10 మంగళ - శ్రీగురుదశమి - సా॥ 5-30 గం. సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన

14 శని - నరక చతుర్దశి, అమావాస్య - దీపావళి - ఉదయం 11గం. సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన

18 బుధ - నాగుల చవితి

25 బుధ - చిలుక ఏకాదశి (కార్తీక శుద్ధ ఏకాదశి)

26 గురు - క్షీరాబ్ది ద్వాదశి సా॥ 5-30 గం. సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన.

30 సోమ - కార్తీక పౌర్ణమి - (గురుపౌర్ణమి) - సా॥ 5-30 గం. సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన

# పుత్ర ప్రేమ

- అచ్యుతం

వెంకటాపురంలో సుబ్బారావు, సుబ్బమ్మ అనే దంపతులున్నారు. వారు భగవద్భక్తులు. వారికి లేకలేక ఒక పుత్రుడు జన్మించాడు. వారు ఆ పిల్లవాడిని అల్లారు ముద్దుగా పెంచుతున్నారు. వాడికి వెంకట్రావు అని నామకరణం చేశారు. 5 సంవత్సరాలు వచ్చాక అక్షరాభ్యాసం చేయించి స్కూలుకు పంపించారు. గారాబంగా పెంచడం వలన చదువు అంతంతమాత్రంగానే వచ్చింది. వారు పుత్రవాత్సల్యంలో మునిగిపోయి భగవంతుడిని మరచినారు. కుమారుడికి 18 సంవత్సరాలు వచ్చిన తరువాత వివాహం చేశారు.

కోడలి పేరు వెంకాయమ్మ. కోడలు చాలా తెలివి గలది. వివాహం అయిన దగ్గర నుండి భర్త భార్యమాట జవదాటకుండా ఆమె చెప్పినట్లు చేస్తున్నాడు. కోడలు అత్తమామలను సరిగా చూడకుండా తగువులాడుతూ వుండేది. కొడుకు తల్లిదండ్రులను పట్టించుకోకపోగా, మిమ్మల్ని నా భార్య శ్రద్ధగా చూస్తుంటే తిని కూర్చోలేక ఇంకా మీకు ఏం కావాలి? అంటూ తన భార్యను వెనకేసుకుని వచ్చి మాట్లాడుతున్నాడు. అప్పకి వారికి భగవంతుడు జ్ఞాపకం వచ్చాడు. తమ తప్పు తెలిసివచ్చి తిరిగి భగవన్నామ స్మరణ చేయడం ప్రారంభించారు.

కోడలు అత్తమామలకు రెండు మట్టి బొచ్చెలు తెచ్చి వాటిలో అన్నం పెట్టసాగింది. వెంకట్రావుకి ఒక పుత్రుడు కలిగాడు. వానికి నారాయణ అని పేరు పెట్టారు. వానికి 5సం॥లు వచ్చిన తరువాత వానిని స్కూలుకి పంపించారు. మనవడు నారాయణుడు చాలా తెలివైనవాడు. శ్రద్ధగా చదువుతున్నాడు. నారాయణకు తాతయ్య, నానమ్మల మీద చాలా ప్రేమ. కానీ, వాడి తల్లి తాతయ్య, నాయనమ్మల వద్దకు వెళ్ళనీయదు. ఈ పరిస్థితులలో సుబ్బారావు, సుబ్బమ్మ భగవన్నామ స్మరణ బాగా చేసుకుంటున్నారు. ఒకరోజు కోడలు ఊరు వెళ్ళింది. అప్పుడు నారాయణ తాతయ్య, నాయనమ్మల దగ్గర చేరి ఆడుకుంటున్నాడు. వాడికి వారి వద్ద వున్న మట్టి బొచ్చెల మీద దృష్టి పడింది. వాటిని తీసి భద్రంగా లోపల దాచాడు.

కోడలు ఊరి నుండి తిరిగి వచ్చి అత్తమామలకు భోజనం పెట్టడానికి అన్నం పట్టుకుని వెళ్ళి, బొచ్చెలిమ్మని అడిగితే, వారు 'అవి అక్కడ లేవు' అని చెప్పారు. 'అయితే మీరు పారవేశారు కాబట్టి, మీ అబ్బాయితో చెప్పి అన్నం పెడతాను మీకు' అన్నది. పాపం! వాళ్ళు 'అమ్మా! నీవు లేనప్పుడు నీ కొడుకు నారాయణ ఇక్కడ ఆడుకోవడానికి వచ్చాడు ......' అన్నారు. వెంటనే ఆ పిల్లవాడిని అడగటానికి తల్లి వెడుతుంటే, అంతా గమనిస్తున్న నారాయణ అమ్మకు ఎదురుగా వచ్చి నిలబడ్డాడు. తల్లి కోపంగా 'నారాయణా! ఆ ముసలివాళ్ళ దగ్గర బొచ్చెలు నువ్వు తీశావా?' అనేసరికి, నారాయణ 'అమ్మా! తాతయ్య నాయనమ్మలు పెద్దవాళ్ళు. వారికి నువ్వు ఈ మట్టి బొచ్చెలలో అన్నం పెడుతున్నావు కదా. కాబట్టి రేపు మీరు కూడా పెద్దవాళ్ళు అవుతారు కదా! అందుకే నేను భవిష్యత్తులో నీకు, నాన్నగారికి భోజనం పెట్టడానికి పనికి వస్తాయని ఆ బొచ్చెలు తీసి దాచాను జాగ్రత్తగా!' అని సమాధానం చెప్పేసరికి ఆ తల్లికి కనువిప్పు కలిగింది.

నేను అత్తమామల పట్ల చాలా అసభ్యకరంగా ప్రవర్తించి, వారికి మనస్తాపాన్ని కలిగించాను. నా కొడుకు చిన్నవాడైనా నా తప్పు నాకు తెలిసేలాగా చేశాడు అని గ్రహించి, అత్తమామలకు క్షమాపణ చెప్పి, ఆ రోజు నుంచి వారిని బాగా చూసుకోవడం మొదలు పెట్టింది.

సుబ్బారావు, సుబ్బమ్మలు పుత్రవాత్సల్యంలో పడి భగవన్నామ స్మరణ మరిచారు. ఎప్పుడైతే వారికి బాధలు ప్రారంభం అయ్యాయో అప్పుడు దారా పుత్రాదుల ప్రేమ స్వార్థంతో కూడినది అని తెలుసుకొని పశ్చాత్తాపపడి తిరిగి భగువంతుడిని నీవే మాకు శరణ్యం అని భగవద్భక్తిలో జీవితం గడపడం ప్రారంభించారో, ఆ తరువాత వారికి మనుమడు కలిగి, వాడికి నారాయణ అనే పేరు పెట్టుకోవడం జరిగింది. అలా భగవద్ధ్యానం వలన భగవంతుడు వారి మొర విని, ఆ మనుమడి రూపంలో వారి బాధలను తొలగించాడు. అలా కుర్రాడి వలన వారి తల్లిదండ్రులకు మంచి బుద్ధి కలిగింది. అందుచేతనే ఎప్పుడూ భగవన్నామ స్మరణ మరువరాదు.

# జీవితము ఒక నాటకము

- బొంబాయి కృష్ణారావు

పుట్టిన ప్రతి జీవి గిట్టక మానదు. జన్మ, మృత్యువు అనేవి నాటకంలో నటుల ప్రవేశము, నిష్క్రమణ లాంటివి. నిజానికి జీవతమనేది ఒక నాటక రంగం. నటులంతా డైరెక్టర్ చెప్పినట్లు, పాత్రకు తగినట్లు నటిస్తే, పాత్ర పోషణ బాగా జరిగింది, పాత్రలో జీవించాడు అంటాము. మరి మన జీవిత నాటకంలో డైరెక్టర్ ఎవరంటే మన సద్గురుమూర్తి. ఆయనను ఆశ్రయించి, ఆయన చెప్పినట్లుగా సాధన చేయాలి.

నాటకంలోని పాత్రల మధ్య సంబంధం ఆ సీను పూర్తి అయ్యేవరకే. లోకంలోని దారా పుత్రాదుల సంబంధం కూడా అంతే. నాటకంలో ప్రతి రంగంలోనూ ఎవరి పాత్రను వారు పోషిస్తూ వుంటారు. జీవితంలో భార్యా పుత్రులు అంతా తోటి నటులు అని గ్రహించాలి. ఎవరి పాత్రను వారు ఏకాగ్రతతో నటించినట్లు, ఎవరి లక్ష్యార్థంపై వారు మనసు నిలిపి మనుగడ సాగించాలి.

నాటకంలో భీముడు, దుర్యోధనుడు యుద్ధం చేస్తారు. గుణాలు ప్రదర్శిస్తారు. పాత్రలు అలసిపోతాయి. కానీ, నటులు ప్రభావితులు కారు. అలసిపోరు. అలాగే ఉపాధి ధర్మాల అవగాహన వున్న సాధకుడి దినచర్యలు సహజంగా జరుపబడతాయి. మనసులు శ్రమ పడవు.

పాత్రధారులు వేసుకున్న దుస్తులు, నగలు వారివి కావు. నటుడు కూడా 'తనవి కావు' అన్న ఎరుకలోనే వుంటాడు. ఇవన్నీ యజమానివి కాబట్టి అతనికి ఆశ లేదు. అలాగే ఈ చరాచర సృష్టి అంతా వాడిదే అన్న వివేకము మమకారాన్ని దగ్గరకు రానీయదు. మాటలు, సాహిత్యము, పాటలు ఇవన్నీ తన చేత చెప్పబడ్డ కథకు సంబంధించినవి. నటుడికి చెందినవి కావు. అలాగే అవన్నీ మధ్యలో వచ్చిన సిరిసంపదలు, పాండిత్య ప్రకర్ష, కులోన్మాదము, డిగ్రీలు అన్నీ కాల, స్థల పరిమితిలో వుంటాయి.

నిజానికి పాత్రకు ఉన్న ఔచిత్యము వేరు, అది కథను బట్టి వుంటుంది. నటుడికి వచ్చే పేరు వేరు. అది నటనను బట్టి వుంటుంది. నటించే సమయంలో తన వ్యక్తిత్వాన్ని ప్రక్కకు పెట్టి, డైరెక్టర్ చెప్పినట్లుగా చెయ్యాలి. నిజమైన సాధకుడు కూడా తన ఉపాధి లక్షణాలకు స్వస్తి

చెప్పి, గురువాజ్ఞాపాలన చేయాలి.

అసలు అజ్ఞానమంతా సంపాదన, బంధువులు, కులాలు, మతాలు సత్యమని అనుకోవడమే. ప్రతివారూ తను, మనో, ధనాలను అసత్యమైన వాటికి అర్పించడం నేర్పింది మన వ్యవస్థ. దానవులు ఈ అజ్ఞానము వలనే మృత్యువు తప్పదని తెలిసి కూడా అది దాటాలని తపస్సు చేశారు. ఎవరి చేతిలో చావకూడదో, ఎలా మృత్యువు రాకూడదో కోరుకున్నారు.

జంతువులకు విచక్షణ జ్ఞానము లేదు. విచారించి, వివేకంతో, నిత్యమైన దానికోసం పరితపించే ప్రజ్ఞ ఒక్క మానవులకే ఇచ్చాడు భగవంతుడు. మరో గమ్మత్తు ఏమిటంటే - నా మృత్యువు ఎప్పుడో, ఎక్కడో వున్నది. మిగిలిన వారికి మాత్రం ప్రక్కనే వుంది అనుకోవడం. ఇది ఒక నాటక రంగమని, నిత్యము, సత్యము అయినదేదో అదే నా స్వరూపమని, అది తెలుసుకోవాలని తపన కావాలి. ఆ స్థితిలో నిరంతరం రమించే సద్గురుమూర్తి మాత్రమే మనల్ని గమ్యస్థానం చేర్చగలరు.

జీవితం ఒక నాటకమని తెలుసుకుని, బాబూజీవారి ఆజ్ఞ ప్రకారం, కొన్ని దశాబ్దాలపాటు, వారి జీవితాలను సత్యసాధకులుగా గడిపిన కుటుంబాలు మన ఆశ్రమంలో కోకొల్లలు. 'మనమంతా సత్రంలో బాటసారులము. సాధన కోసం వచ్చాము. సాధన చేసుకుని, ఎక్కడి నుంచి వచ్చామో, అక్కడకు వెళ్ళడమే' అని తమ కుటుంబ సభ్యులకు చెప్పి, ఆ మార్గంలో జీవితాన్ని గడిపిన ధన్య సాధకులు వున్నారు. ఆశ్రమ భక్తుల గురుసాయుజ్య లీలలు వింటుంటే, మన ఆశ్రమము ఒక అద్వైత ప్రయోగశాల అనిపిస్తుంది!!

# మా ఆశ్రమము - శ్రీకాళీవనాశ్రమము

- గోనుగుంట్ల శైలజ

(గత సంచిక తరువాయి)

జగన్మాత ఆలయంలో పూజారిణిగా వేంకటరత్నంగారి భార్య కళ్యాణమ్మగారు వుండేవారు. భర్తకు తగ్గ భార్య. ఆ జగన్మాత పూజ తప్ప మరొకటి తెలియదు. ఇక్కడ కుంకుమార్చన చేస్తూ వుండేవారు.

ఈ ఆలయానికి ముందు నవగ్రహాలు ఏక చక్ర రథంపై ఆశీనులై, చూపరులకు వారంతా సభతీర్చి వున్నట్లుగా కనబడతారు.

ఈ ఆలయానికి ప్రక్కన రామాలయము, రాధాకృష్ణాలయము వున్నాయి. వీటికి మూర్తిగారు, కమలమ్మగారు పూజారులుగా వుండేవారు. మూర్తిగారు రైల్వేలో పెద్ద పదవిచేసి, రిటైర్ అయి భగవంతుని సేవకు అంకితమయ్యారు.

ఈ రామాలయం చాలా పెద్ద మందిరం. పర్వదినాలలో ఇక్కడ ఆధ్యాత్మిక సభలు జరుగుతాయి. తరువాత భక్తులు కులమత భేదాలు లేకుండా భోజనాలు చేస్తారు. వడ్డించేవాళ్ళు వడ్డిస్తుంటే తినేవాళ్ళు భగవన్నామం చేసుకుంటూ తృప్తిగా తింటారు.

ఇక్కడ భక్తులకు వేదములు నేర్పడం, పూజలు చేయించడం మొ॥ వాటిలో అగ్రగణ్యులైనవారు ఒకరు వుండేవారు. ఆమె పేరు హనుమాయమ్మగారు. లలితానంద సరస్వతీ స్వామినిగా పిలువబడేవారు. ఈమె నిజంగా అపర సరస్వతియే. ఆమె ఉపన్యాసం చెబుతుంటే ఆనాడు మైత్రేయి అలా చెప్పినదా అని అనిపించేది.

బయట వ్యవహారములు, ఆశ్రమ వ్యవహారములు చూసేందుకు రిటైర్డ్ రైల్వే ఆఫీసర్ నారాయణరావు గారు వుండేవారు. ఈయన క్రమశిక్షణకు మారుపేరు. ఈయన భార్య రాధమ్మ. గురుదేవులు వీరిని రాధానారాయణలు అని పిలిచేవారు. ఆశ్రమం కోసం ఎంతో త్యాగం చేసి, చివరివరకు గురుదేవులను అంటిపెట్టుకుని సేవచేసి, ప్రశంశలు పొందినవారు పాండురంగ శ్రీశైలరావుగారు.

రోజూ భగవంతుడి అలంకరణ కోసం కొంతమంది స్త్రీలు పూలదండలను గుచ్చుతూ వుంటారు. వారు పువ్వులను తమ

హస్తములతో సున్నితంగా పట్టుకుని, అవి బాధపడకుండా, భగవన్నామం చేస్తూ ఎంతో అందంగా దండలు గుచ్చుతూవుంటారు. వారి సేవ అమోఘము. పూలను మాలకట్టడానికి ఎంతో ఓర్పు నేర్పు కావాలి. వారి సేవ చూసి శ్రీగురుదేవులు ఎంతో ఆనందించేవారు.

శ్రీ గురుదేవులు నివసించే మందిరం ముందు 'అమ్మగది' వుంది. ఆ గదిలో జగన్మాత, ఆంజనేయ స్వామి ఫొటోలు వుంటాయి. దానిని పీఠము అంటారు. స్వామి భౌతికంగా వున్నప్పుడు ఆయనే స్వయంగా పూజ చేసేవారు. ఇప్పుడు ఆ పూజ లక్ష్మి అనే ఆవిడ చేస్తారు. ఈమె సత్యమనే కవచాన్ని ధరించి, గురువిచ్చిన లక్ష్యార్థాన్ని సాధించింది. భగవంతుని అలంకరించడంలో సిద్ధ హస్తురాలు. అంతేకాదు దేవాలయానికి కావలసిన పూజా ద్రవ్యాలను కూర్చడం, పూలదండలు అలంకరించడం మొదలైన పనులు నిర్వహిస్తారు. భగవంతుని సేవలో ఏ చిన్న లోపం వచ్చినా కూడా సహించరు. అందుకే కఠినంగా, నిర్మొహమాటంగా వారి తప్పులను వారికి తెలియజేసి సరిదిద్దుతారు. తల్లి తమ పిల్లలు ఎంత గొప్ప పని చేసినా కూడా వారి ఎదురుగా పొగడదు. చాటుగా ప్రశంసిస్తుంది. కాని చాలామందికి తెలియదు.

తరువాత చెప్పుకోవలసినావిడ సుగుణమ్మగారు. ఈమె నిజంగా సుగుణాల రాసి. నెమ్మది. శాంతమునకు నిర్వచనము. ఆశ్రమ వ్యవహారాలన్నిటినీ తెరచాటు నుండి నడిపించి, ఏమీ తెలియనివారిలా వుండేవారు. ఈమె తానొవ్వక, ఇతరులను నొప్పించక పనులను చేయించడంలో సిద్ధహస్తురాలు.

- సశేషం

## శ్రద్ధాంజలి

శ్రీబాబు చిరకాల భక్తులు, ఆశ్రమ స్థిరనివాసులు అయిన శ్రీమతి అప్పన మంగరాజు మామ్మ గారు 23-8-2020 ఆదివారం నాడు శ్రీసద్గురు సాయుజ్యం పొందారు. వీరి వయస్సు 95 సంవత్సరాలు. సద్గురుదేవులు వీరి ఆత్మకు శాంతిని ప్రసాదించెదరు గాక! వీరి కుటుంబ సభ్యులకు, బంధుమిత్రులకు మా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాము.

# రామాయణంలో స్త్రీ పాత్రలు -సుషమ్మా ప్రసాద

## త్రిజట

సుందరకాండలో అశోకవనంలో మనకు సీతమ్మతల్లి సన్నిధిలో త్రిజట పరిచయమవుతుంది. రావణాసురుడు సీతమ్మకు కాపలా వుంచిన రాక్షస వనితలలో త్రిజట ఒక విలక్షణమైన పాత్ర. మట్టిలో మాణిక్యం లాగా, బురదలో మొలచిన కమలము సూర్యుని ఆకర్షించినట్లుగా, త్రిజట రాక్షస స్త్రీలలో తప్పబుట్టిన దేవత లాంటిది. వాల్మీకి మహర్షి త్రిజటను వృద్ధ రాక్షస వనితగా పరిచయం చేస్తారు. రాళ్ళల్లో రత్నం లభించినట్లుగా రాక్షస స్త్రీలలో ఈ జాతిరత్నం ప్రకాశిస్తుంది. త్రిజటను విభీషణుని కుమార్తెగా చాలా మంది రామాయణ గ్రంథ కర్తలు తమ అభిప్రాయాన్ని వ్యక్తపరిచారు. వాల్మీకి మహర్షి ఆ విషయాన్ని ప్రస్తావించలేదు. ఆమె విభీషణుని కుమార్తె కావచ్చు, కాకపోవచ్చు. కాకపోతే, ఆమె విభీషణుని లక్షణాలతో ప్రకాశిస్తున్నది కాబట్టి ఆమెను విభీషణుని మానస పుత్రికగా భావించవచ్చు.

రావణుడు తెల్లవారుజామున అశోక వనానికి వచ్చి సీతమ్మను బెదిరించి వెళ్ళిన తరువాత, రాక్షస స్త్రీలు సీతమ్మ చుట్టూ చేరి, భయంకరంగా ప్రవర్తించారు. అంతవరకూ అక్కడ నిద్రిస్తున్న వృద్ధురాలైన రాక్షస స్త్రీ నిద్రలేచి, సీతమ్మను బెదిరిస్తున్న రాక్షసాంగనలను వారించింది. రావణుని ఆజ్ఞానుసారం సీతమ్మను హింసిస్తుంటే, ఆమె నిద్రపోయింది, భయంకరమైన వృత్తి ధర్మము కంటే, ఆదమరచి నిద్రపోవటమే మేలని భావించింది. ఆమె ఎవరో స్పష్టంగా తెలియకపోయినా, ఆ చిన్నపాత్రలో శాశ్వతంగా రాణించింది. గుర్తింపు లేకుండా, గుర్తింపు కోరకుండా మంచి పనులు చేసిన ఆదర్శమూర్తి. చెడును చూడలేని, చెడును వినలేని విశిష్ఠమైన వ్యక్తి త్రిజట. ఆమె సరళ హృదయురాలు.

త్రిజట వృత్తి రీత్యా రాక్షస స్త్రీలలో ఒకతె అయినా, ప్రవృత్తి రీత్యా ఆమెలో రాక్షస లక్షణాలు లేవు. సీతమ్మను సంహరించడానికి సంసిద్ధమవుతున్న రాక్షస వనితలను త్రిజట తన స్వప్న వృత్తాంతంతో భయభ్రాంతులకు గురిచేసి, వారి ప్రయత్నాన్ని విరమింపజేసింది. త్రిజట తన స్వప్న వృత్తాంతాన్ని చెబుతూ తనకు తెల్లవారుజామున స్వప్నం

వచ్చింది కాబట్టి అది వాస్తవమవుతుందని, రావణునికి పతనం ఖాయమని చెప్పి వారందరినీ భయానికి గురిచేసింది. సీతమ్మ జీవితంలో బాధల చీకట్లు మాయమవుతాయని, ఆనంద తోరణాలు భాసిల్లుతాయని జోస్యం చెప్పినట్లు చెప్పింది. రాక్షసకాంతలను సీతమ్మను చంపే ప్రయత్నం మానుకోమని హితవాక్యం పలికింది.

త్రిజట స్వప్నము ఒక వింత అనుభూతిని, గొప్ప మానసిక పరిణామమును సూచిస్తుంది. ఆమె ఇలా చెబుతుంది .....

స్వప్నే చాద్య మయా దృష్టా సీతా శుక్లామ్బరావృతా
సాగరేణ పరిక్షిప్తం శ్వేతం పర్వత మాస్థితా ॥

తెల్లని వస్త్రాలు ధరించి, సముద్ర మధ్యలో వున్న తెల్లని కొండపై సీతమ్మను దర్శించాను. వాల్మీకి మహర్షి కమనీయంగా రచించిన త్రిజట స్వప్న వృత్తాంతంలో త్రిజట ఒక ప్రేక్షకురాలిలాగా దర్శించింది. ఆ స్వప్నమును చక్కగా విశ్లేషించి, విశదపరచిన ప్రతిభావంతురాలైన వనితగా భాసిల్లింది. రోహిణి చంద్రుని చేరినట్లు సీతమ్మ రామచంద్రుని తప్పక చేరుతుంది. రామచంద్రునిచేత రావణునికి వినాశనము తప్పదని, సీతారాముల సమాగమము అనివార్యమని చెప్పింది.

- సశేషం

## శ్రద్ధాంజలి

శ్రీబాబు చిరకాల భక్తులు, ఆశ్రమ స్థిరనివాసులు అయిన శ్రీ చేకూరి సత్తిరాజుగారు (గుంటూరు సత్తిరాజు)29-8-2020 శనివారం నాడు శ్రీసద్గురు సాయుజ్యం పొందారు. వీరి వయస్సు 80 సంవత్సరాలు. సద్గురుదేవులు వీరి ఆత్మకు శాంతిని ప్రసాదించెదరు గాక!

వీరి కుటుంబ సభ్యులకు, బంధుమిత్రులకు మా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాము.

# శ్రీశ్రీశ్రీ బాబూజీ మహరాజ్‌వారితో అనుభవాలు

-వి. లక్ష్మీ నరసమాంబ

2006లో ఒకసారి విజయవాడ వెళ్లాను. నేను పెరిగింది, చదివింది విజయవాడలోనే! అప్పటిలో మా అక్కగారి కుటుంబం అక్కడే వుంది. మా అక్కను తోడు తీసుకుని ఒక మధ్యాహ్నం నంబూరు ఆశ్రమాన్ని వెతుక్కుంటూ వెళ్ళాను. ఆశ్రమంలో, బృందావనంలో, ఒక మహానుభావుడు వ్యాఖ్యాన సహితంగా పురాణ ప్రవచనం చేస్తున్నారు. బాబూజీగారి పీఠానికి ఎడమ ప్రక్కగా మాతాజీగారు కూర్చుని దాన్ని శ్రద్ధగా వింటున్నారు. ఆశ్రమ వాసులు 50, 60మంది దాకా శ్రోతలు వున్నారు. మేము కూడా వారితోపాటుగా కూర్చుని ఒక గంట, గంటన్నర సేపు పురాణం విన్నాము. అది అయిన తరువాత మాతాజీగారు యాదృచ్ఛికంగా 'మానవ జీవితం సముద్రం మీద ప్రయాణం చేసే నావ లాంటిది. ఒక్కొక్కప్పుడు కష్టాలనే అలల తాకిడికి, ఆ నావ ఎప్పుడు మునిగిపోతుందో అని భయపడుతూ వుంటాము. ఒడ్డు కానరాక, ఎటు ప్రయాణం చేస్తున్నామో తెలియక అయోమయ స్థితిలో పడిపోతాము. అలాంటి స్థితిలో ఒక గురువును నమ్ముకుని, ఆయన సూచించిన మార్గంలో జీవితాన్ని నడుపుకోండి. తప్పక వెలుగు కనిపిస్తుంది' అన్నారు.

నేను ఆశ్చర్యంతో అవాక్కయ్యాను. ఎందుకంటే, అప్పుడు నా పరిస్థితి అలానే వుంది. ఎటు పోవాలి? ఎలా నా జీవితాన్ని మలచుకోవాలి? ఒంటరితనం లేకుండా అర్థవంతంగా ఎలా జీవించాలి? ఏది ఒడ్డు? ఏది దరి? ..... ఇలాంటి అయోమయ స్థితిలో వున్నాను.

అప్పుడు బాబూజీ విగ్రహం వంక చూశాను. ఈయనే నా మనస్సులో వున్న ఆలోచనలను తెలిసికొని, నన్ను వేధిస్తున్న సందేహాలకు సమాధానం మాతాజీగారి ద్వారా చెప్పించారా? ఎంత ఆశ్చర్యం! ఇది ఎలా జరిగింది? ఇలా ఆశ్చర్యపడుతూ బృందావనం వెనుక వున్న విజ్ఞానమందిరం మెట్ల మీద కూర్చుని వున్న అమ్మగారిని కలిశాను. అక్కా, నేనూ ఇద్దరం నమస్కారం చేశాము. ఆవిడ ప్రతిస్పందించారు. నేను నా వివరాలను, నా సమస్యలను వివరించాను.

'నాకు జీవితంలో ఏ లోటూ లేదు. డబ్బుకు కొదవలేదు. పిల్లలు

చక్కగా స్థిరపడ్డారు. ఒంటరితనం నా సమస్య' అని చెప్పాను. అందుకు ఆమె 'నేనూ మీ లాంటి భక్తురాలినే! ఏదో పదిమందికి చేయగలిగిన సేవ, గురుకృప వలన చేయాలని నా సంకల్పం. మీరు కూడా ఇక్కడకు వస్తూ వుండండి! ఎలా వుంటుందో చూడండి! హైదరాబాద్ మెహిదీపట్నంలో ఆశ్రమ శాఖ వున్నది. అక్కడకు కూడా మీరు వెళ్లవచ్చు' అంటూ అక్కడే ఉన్న ఒక భక్తుడిచేత హైదరాబాద్ ఆశ్రమం ఫోన్ నెంబరు ఇప్పించారు. అంతటితో ఆనాటికి వారివద్ద నుండి శెలవు తీసుకున్నాము. అలా గురుకృప ప్రప్రథమంగా నా మీద వర్షించింది.

## హైదరాబాదు శాఖతో పరిచయం - అనుబంధం

అది జరిగిన కొద్ది రోజులకే మా అక్క విజయవాడ నుండి హైదరాబాద్ వచ్చింది. ఆమెను తోడు తీసుకుని, మెహిదీపట్నంలోని ఆశ్రమానికి ఫోన్‌చేసి, అడ్రస్ తెలుసుకుని వెళ్లాను. ఆనాటి ఆశ్రమ సందర్శనం నాకు ఈనాటికీ కళ్లకు కట్టినట్లుగా వుంది.

అక్కడ కుట్టిగారు, భార్య లక్ష్మిగారు ఆ సమయంలో ఆశ్రమసేవలో వున్నారు. మరొక కుటుంబం వారు కూడా వున్నారు. ఒక చిన్న హాలులో వున్న బాబూజీ విగ్రహం నన్నెంతగానో ప్రభావితం చేసింది. కుట్టిగారు, లక్ష్మిగారు నన్నెంతగానో ఆదరించి, ఆశ్రమ కార్యక్రమాలకు ఆహ్వానించారు. నేను వారికి నంబూరులో నాకు కలిగిన అనుభవాన్ని వివరించాను.

'అవును. అలాంటి అనుభవాలు మా అందరికీ కూడా వున్నాయి. మాతాజీగారు చెప్పినట్లుగా మీరు అక్కడకు వస్తూ వుండండి! మీ అనుభవాన్ని గమనించండి! ఇవి ఎవరికి వారికే స్వంతం!' అని కుట్టిగారు అన్నారు. నాకు నిజమే అనిపించింది. ఎందుకంటే మా అక్క కూడా ఈ రెండు సందర్భాలలో నాతో వుంది. ఆమెకు ఏ ప్రత్యేకమైన అనుభూతులూ కలుగలేదు. బాబూజీ నన్ను మాత్రమే తన సన్నిధికి పిలిపించుకున్నారా? లేక నేను మాత్రమే ఆపన్న హస్తం కోసం ఎదురు చూస్తుండటం వలన ఆయన చేతిని అందుకున్నానా? ఏమో!

**ఏనాడేమో భవత్పదాబ్జములనెంతే బట్టుకున్నారమో**
**ఆనాడే చరితార్థ జన్మలము మేమైనారమెట్లేని**
**బాబూ! నీ దృష్టిపడం త్యజింప వెటులం పోనీయక**
**ప్రేమించి సుజ్ఞానం బీగల సత్యమూర్తివి కదా! కాళీప్రసాద ప్రభూ!**

- సశేషం


ధ్యాస
మధుప
ఓం
కేశవాయస్వాహా!
1


ఏమండీ! ఇవాళ
వంట ఏం
చేయమంటారు?
2


ఓం నారాయణాయ స్వాహా! వంకాయ కారం పెట్టి వండు. అలాగే ముద్దపప్పు, సాంబారు కూడా చెయ్యి.
3


ఓం మాధవాయ స్వాహా!
ఏమేవ్! సాంబారులోకి అప్పడాలు, వడియాలు వేయించడం మర్చిపోకు!
4


బాబూ! షాపు తాళాలు ఇస్తే నేను వెళ్ళి ఓపెన్ చేస్తాను.
5


నాన్నగారూ! షాప్ అతను తాళాల కోసం వచ్చాడు.
6


ఓం ప్రాణాయ స్వాహా!
సొరుగులో ఉన్నాయి.
ఇచ్చి పంపించు. నేను
వచ్చేదాకా షాప్ జాగర్తగా
చూసుకోమను. అసలే
రోజులు బాగోలేదు.
7


భగవంతుడు ప్రత్యక్షం
కావాలంటే ఏ పని
చేస్తున్నా నీ ధ్యాస
ఎప్పుడూ ఆయనమీదే
పెట్టుకోవాలి. కనీసం
పూజ, ధ్యానం వంటివి
చేసేటప్పుడైనా ఇతర
విషయాలు వదిలి
ఆయనమీద ధ్యాస
పెట్టాలి కదా! ఇలా
పూజ చేస్తున్నంత
సేపూ ధ్యాసంతా
వంట మీద,
వ్యాపారం మీద
పెట్టేవాడికి ఆ పూజ
పూర్తయ్యేసరికి అవే
ప్రత్యక్షమవుతాయి
కానీ భగవానుడు
కాదు.
8

ఓం శ్రీ గురుభ్యోనమః

# శ్రీ దేవీ శరన్నవరాత్రి మహోత్సవముల కార్యక్రమములు - 2020

కోవిడ్ -19 వ్యాధి వలన ఏర్పడిన పరిస్థితుల దృష్ట్యా, భక్తులందరి భద్రతను దృష్టిలో వుంచుకుని, ఈ సంవత్సరం శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవములను ప్రస్థుతము ఆశ్రమములో వున్నవారితోనే కార్యక్రమములు నిర్వహించవలెనని శ్రీ మాతాజీగారి అనుమతితో నిర్ణయించబడినది. బయట గ్రామములలో/పట్టణములలో వున్న భక్తులు ఆశ్రమంలో జరిగే కార్యక్రమములలో పరోక్షంగా పాల్గొనే విధముగా ప్రత్యక్ష ప్రసారము (లైవ్ దర్శన్) ఏర్పాటు చేయబడును.

1) నిత్య కార్యక్రమములు సుప్రభాతము, నగర సంకీర్తన, ప్రార్థన, ఆలయదర్శనములు, తీర్థప్రసాదములు యథావిధిగా జరుగును.

2) 17-10-2020 శనివారం ఉదయం 7-45గం.లకు పూజ్యశ్రీ మాతాజీవారిచే శ్రీదేవీ శరన్నవరాత్రి పూజ దీక్షా స్వీకరణము, అఖండ జ్యోతి ప్రజ్వలనము.

3) 17-10-2020 శనివారం నుండి 26-10-2020 సోమవారం వరకు ఉదయం 8గం. నుండి 9గం. వరకు శ్రీ శ్రీనివాస రామానుజదాసు గారిచే శ్రీ దేవీ భాగవత ప్రవచనము.

4) 18-10-2020 ఆదివారం నుండి 25-10-2020 ఆదివారం వరకు ఉదయం 9గం. నుండి 11-30 గం. వరకు సత్సంగ సమావేశము, పూజ్య శ్రీ మాతాజీ వారి అనుగ్రహ భాషణము (ప్రత్యక్ష ప్రసారము చేయబడును), శ్రీబాబూజీ బోధ (వీడియో).

5) 17-10-2020 శనివారం నుండి 26-10-2020 సోమవారం వరకు మధ్యాహ్నం 12-30గం.లకు శ్రీ బాబూజీ మహరాజ్‌వారి దేవతార్చన మందిరంలోను, శ్రీ జగన్మాత ఆలయంలోను సహస్రనామ కుంకుమార్చనలు జరుగును. పూజ అనంతరము తీర్థ ప్రసాద వితరణ, కుంకుమ పూజలు కేవలము ప్రధాన కర్తల ద్వారా మాత్రమే జరుపబడును. (ఆసక్తి కలవారు లైవ్‌లో చూస్తూ ఇంటి వద్దనే చేసుకొనవచ్చును). ఈ కార్యక్రమము యూట్యూబ్ ద్వారా ప్రత్యక్ష ప్రసారము చేయబడును. వార్షికముగా కుంకుమ పూజలు చేసుకునే భక్తులు తమ గోత్రనామాలతో పూజ జరిపించుకొనవచ్చును.

వివరములకు శ్రీ ప్రసాద్‌గారిని మొబైల్ నెం. 9493786602 లో సంప్రదించవలెను.

6) 21-10-2020 బుధవారం - మూలా నక్షత్రం - శ్రీ సరస్వతీ పూజ.

7) 24-10-2020 శనివారం - దుర్గాష్టమి మరియు మహర్నవమి. శ్రీ జగన్మాత సామూహిక కుంకుమ పూజలు ప్రధాన కర్తలు మాత్రమే నిర్వహించెదరు. బయట గ్రామముల వారు గోత్రనామములతో పూజ జరిపించుకొనగోరు వారు వివరములకు శ్రీ సుబ్రహ్మణ్యం గారిని మొబైల్ నెం. 9493786603 లో సంప్రదించవలెను.

8) 25-10-2020 ఆదివారం - శ్రీ విజయదశమి. శ్రీ జగన్మాత సామూహిక కుంకుమ పూజలు ప్రధాన కర్తలు మాత్రమే నిర్వహించెదరు. గోత్రనామములతో పూజ జరిపించుకొనగోరు వారు వివరములకు శ్రీ సుబ్రహ్మణ్యం గారిని మొబైల్ నెం. 9493786603 లో సంప్రదించవలెను.

9) అన్నప్రాసనము చేయించుకొన దలచినవారు తమ ఇళ్ళవద్దనే శ్రీబాబూజీ మూర్తికి నివేదన చేసిన ప్రసాదముతో అన్నప్రాసన చేసుకొనవలెను. అక్షరాభ్యాసము చేయించుకొనదలచినవారు తమ ఇళ్ళవద్దనే శ్రీబాబూజీ మూర్తి వద్ద కూర్చుని చేసుకొనవలెను. అన్నప్రాసనలు, అక్షరాభ్యాసములు చేసుకొనేవారు, గోత్రము, తండ్రిపేరు, శిశువు పేరు, వారి మొబైల్ నెంబరు, 24-10-2020 శనివారం మధ్యాహ్నం 3గం.ల లోపు శ్రీ వంకిన బాబుకు మొబైల్ నెం. 9493786601కు తెలియజేసిన యెడల పూజ్యశ్రీ మాతాజీవారు ఆశీర్వచనము చేస్తారు.

10) నామకరణములు చేయించుకొనదలచినవారు తండ్రిపేరు, శిశివు జన్మించిన తేదీ, సమయము, నక్షత్రము, వారి మొబైల్ నెంబరు నమోదు చేయించుకున్నవారికి 25-10-2020 ఆదివారం విజయదశమి రోజున ఉదయం 6గం.ల నుండి 8గం.ల మధ్య జూమ్ మీటింగ్ ద్వారా శ్రీ మాతాజీ నామకరణములు చేస్తారు. నామకరణములు చేయించుకోదలచినవారు శ్రీ వంకిన బాబుకు మొబైల్ నెం. 9493786601కు పూర్తి వివరములు తెలియజేయగలరు.

11) 26-10-2020 సోమవారం ఏకాదశి, ఏకాహం, శ్రీదేవీ శరన్నవరాత్రుల దీక్షా విరమణ, శ్రీజగన్మాత నగరోత్సవం, శ్రీ

సద్గురుపాదపూజ అనంతరం తీర్థ ప్రసాదములతోపాటు శ్రీ జగన్మాతకు పూజ చేసిన కుంకుమ, బీజాక్షర పూతములైన మంత్రాక్షతలు ఇవ్వబడును. పూజా కుంకుమ, అక్షతలు, హైదరాబాదు, పెదనింద్రకొలను, గుండుగొలను శాఖలలో కూడా లభించును.

12) కుంకుమ పూజలు గోత్రనామాలతో చేయించుకున్నవారికి కుంకుమ, అక్షతలు, ప్రసాదము పోస్టుద్వారా పంపించబడును. మీ గోత్రనామాలతోపాటుగా మీ చిరునామా, ఫోన్ నెం., పాన్ నెం. తప్పనిసరిగా ఇవ్వవలెను.

13) శ్రీ సద్గురు మండల దీక్ష స్వీకరించేవారు ఆశ్వీయుజ పౌర్ణమి 31-10-2020 శనివారం రోజు తె.జా 4గం. లకు దీక్షమాల ధరించవలెను. మండలదీక్ష పూర్తిగా చేసినవారు 10-12-2020 న హెూమంలో పాల్గొన వచ్చును.

23-9-2020 కార్య నిర్వాహక వర్గం,

శ్రీ కాళీ వనాశ్రమము.

వివరములకు :

కుంకుమ పూజలు - శ్రీ ప్రసాద్ - 9493786602

సామూహిక పూజలు - శ్రీ సుబ్రహ్మణ్యం - 9493786603

అన్నప్రాసనలు...............................

అక్షరా భ్యాసములు ................. శ్రీ వంకిన బాబు 9493786601

నామకరణములు........................

సమాచారము : 9493786601 - 05, 0863 - 2293109

# ఎవరు అమరుడు?

(గత సంచిక తరువాయి)

-సుషుమ్నా ప్రసాద

ప్రాణమే ఋగ్వేదం, యజుర్వేదం, సామవేదాలనే మూడు రీతులైన వేద మంత్రాలు. ప్రాణమే యజ్ఞం. ప్రాణమే కర్మ చెయ్యడంలో అధికారరూప బ్రహ్మ. కుండలో బండి ఆకుల మాదిరి ప్రాణంలో సమస్తం వుంచబడి వున్నది. ప్రాణమే దేవతలకు హవిస్సును, పితృ దేవతలకు స్వధారూపమైన అన్నాన్ని అందిస్తున్నారు. పరాక్రమం చేత ప్రాణం రుద్రుడు వర్ష రూపంలో వర్షించి, స్వేచ్ఛగా ప్రజలకు అన్నం లభించి, ఆనంద భరితులవుతున్నారు. ప్రాణం సంస్కారం అవసరం లేకుండానే స్వభావంగానే పరిశుద్ధుడు. వారందరూ ప్రాణాన్ని ఇలా స్తుతించారు.

సమస్తమూ ప్రాణం స్వాధీనంలో వున్నదని, ప్రాణమే తమకు తండ్రియని, జననీజనకులు తమ సంతతిని సంరక్షించినట్లు తమను రక్షించమని, తమకు రక్షణగా వుండి, తమకు సంపదను, ప్రజ్ఞ, అశేష జ్ఞానాన్ని ప్రసాదించమని ప్రార్థించారు. కాబట్టి ప్రాణమే శ్రేష్ఠమైనదని భార్గవమునికి పిప్పలాద మహర్షి తెలియజేశాడు.

ఇదంతా విన్న అశ్వలాయన పుత్రుడు కౌసల్యుడు ప్రాణాన్ని గురించి, పిప్పలాదుని గురించి, మరికొన్ని ప్రశ్నలు వేశాడు. 'ప్రాణం దేని నుండి వుద్భవిస్తుంది? ఏ వృత్తితో దేహంలో ప్రవేశించి, దేహంలో తన స్వరూపాన్ని ఏ విధంగా విభజించుకుని వుంటున్నది? ఏ విధంగా నిష్క్రమిస్తుంది? అంతేగాక బాహ్యాన్ని ఆదిభూత, ఆదిదైవిక, ఆధ్యాత్మిక స్థితులను అధిగమిస్తున్నది? అని ప్రశ్నించాడు.

కౌసల్యుని మాటలకు పిప్పలాది మహర్షి సమాధానమిస్తూ.... 'ప్రాణం పరమాత్మ నుండే పుడుతున్నది. ఈ ప్రాణ తత్వం మనోవ్యాపారం చేత శరీరంలో ప్రవేశిస్తున్నది. ఈ ప్రాణం ప్రాణ, అపాన, వ్యాన, ఉదాన, సమానాలనే అయిదు వాయువులను వినియోగించుకుని తన పనులను నిర్వర్తిస్తున్నది. వీటిలో అపానాన్ని పాయువస్థల్లోను, ప్రాణవాయువును ముక్కు రంధ్రాల ద్వారా కన్ను. చెవి, నోరుల యందు వుంచి, సమానవాయువు ప్రాణ, అపానాల మధ్య నాభి (బొడ్డు)యందు వుంటాడు. ఈ సమాన వాయువు మనం భుజించిన అన్నాన్ని, త్రాగిన నీటిని సమానంగా పంపిణీ చేస్తున్నది. అందుచేత ఆ హృదయాగ్ని నుండి

నేత్ర శ్రోత్రాది ఏడు జ్వాలలవుతున్నాయి. అంతేకాక, హృదయంలో ప్రధానమైన నూటొక్క నాడులున్నాయని, ఒక్కొక్క నాడి నుండి నూరు శాఖా నాడులున్నాయని తెలియజేశారు. వాటి నుండి ఇంకా ఉపశాఖలు ఉత్పన్నమవుతున్నాయి. ఈ నాడుల్లో వ్యానవాయువు సంచరిస్తుంది. ఈ నాడుల్లో ముఖ్యమైన సుషుమ్నానాడి మార్గంలో ఉదానవాయువు సంచరిస్తూ, పుణ్యం చేసిన వారిని పుణ్యలోకానికి, పాపం చేసిన వారిని నరక లోకంలోకి, పుణ్యపాపాలు రెండూ సమంగా వున్నవారిని మానవ లోకంలోకి పంపిస్తుంది.

మరణకాలంలో ఏ సంకల్పంతో ప్రాణం విడుస్తాడో, ఆ సంకల్ప ప్రకారమే ముఖ్య ప్రాణ వృత్తితో కూడుతున్నాడు. ఆ తరువాత ప్రాణవాయువు తేజస్సుతో కూడి, తాను కోరిన దానికి తగిన లోకాన్ని పొందుతాడు. ప్రాణాన్ని గురించి వివరంగా తెలుసుకున్నవాడు అమృతత్వాన్ని పొందుతాడు. విద్వాంసుడు ప్రాణం పుట్టుకను, అయిదు విధాలైన ప్రాణ, అపాన, వ్యాన, ఉదాన, సమానవాయువులను, సూర్యాదులను, దేహంలోని చక్షురాది భేదాలను తెలుసుకొని ముక్తుడౌతున్నాడు.

-సశేషం

## శ్రద్ధాంజలి

శ్రీబాబు చిరకాల భక్తులు, ఆశ్రమ స్థిర నివాసులు అయిన పోపూరి వేంకట రాధాకృష్ణమూర్తిగారు 1-9-2020 మంగళవారం నాడు శ్రీసద్గురు సాయుజ్యం పొందారు. వీరి వయస్సు 84 సంవత్సరాలు. సద్గురుదేవులు వీరి ఆత్మకు శాంతిని ప్రసాదించెదరు గాక!

వీరి కుటుంబ సభ్యులకు, బంధుమిత్రులకు మా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాము.

# శ్రీబాబు దివ్యవాణి

(గత సంచిక తరువాయి)

- డా॥ రాఘవేంద్ర. పరుచూరి

రామనామము మధురాతి మధురమైనది. నీ దుఃఖాన్ని ఈ ధరణి రుచులేవీ తీర్చలేవు. శాంతిని ఇవ్వలేవు. నీవు ఎక్కడున్నా సరే అన్నిటికన్నా మిన్న అయిన ఆనందము రామనామం ద్వారా అందుతుంది. జనరేటర్ స్విచ్ ఆన్ చేయగానే ఎడతెగని కరెంట్ వచ్చినట్లు, నామం చేస్తుంటే అంతులేని ఆనందాన్ని ఇస్తుంది. జపమాల ఎందుకు? భగవన్నామానికి హృదయమాల, మానసిక మాల కావాలి.

నేను చిన్నతనంలో ఒకరింట్లో వుండేవాడిని. నన్ను వారు చాలా ప్రేమగా చూసేవారు. ఆయన నిత్యకృత్యాలు తీర్చుకుని, ఫొటో దగ్గర కూర్చుని బిగ్గరగా 'శ్రీరామ జయరామ జయజయ రామ'; 'హరేరామ హరేరామ రామరామ హరేహరే' - అంటూ జపించేవాడు దొంగల భయం చేత. కానీ, భగవానుడు అనుకుంటాడు పోనీలే ఏలాగో అలాగు నన్ను స్మరిస్తున్నాడు కదా అని ఆ యిల్లు కాపలా కాస్తూ వుండేవాడు. బయట దొంగలనే కాదు, మీరు పట్టుకోలేని అంతరంగ దొంగలను (కామ, క్రోధాది గుణములను) కూడా పట్టుకొనేది రామనామమే.

జ్ఞానము యొక్క పరాకాష్టమే ముముక్షత్వము. లోపల దొంగలను శుభ్రంగా నామరూపాలు లేకుండా చేసి, వారిచే జ్ఞానము హరించకుండా కాపాడతాడు తారక బ్రహ్మము. తప్పక రామనామము అంతటి మహిమ కలది. చూడండి! శనగలు పంచదార పానకములో, వేప రసంలో వేసి చూడండి. పంచదారలోది తీపి, వేపరసంలోది చేదు వస్తుంది. మీ మనస్సు రామనామ రసంలో వుంచితే జనన మరణ భయ శోక విదూరం చేస్తుంది. మానవుడికి ప్రాణ భయం కంటే వేరొకటి లేదు. మృత్యుదేవతకు ప్రతివాడూ భయపడతాడు. అటువంటి భయం లేకుండా, మృత్యుదేవత కూడా దగ్గరకు రాకుండా చేస్తుంది ఈ రామనామము. అదే త్యాగయ్య అంటాడు 'నాకు నీవున్నావు, నీకెవరున్నారు? నీ అబ్బతో చెప్పుకో'మని. భక్తుడికి భగవంతుని దగ్గర అంత చనువు వుంటుంది.

త్యాగయ్య ఇలా అన్నప్పుడు రాముడు తన బిడ్డ మీద ఎంత వాత్సల్యాన్ని చూపాడో! ఎంత ఆనందాన్ని వర్షింపజేశాడో! అంతటి ఆనందానికి, ప్రేమకు త్యాగయ్య పాత్రుడయ్యాడు. ఆ విశ్వాసం వలనే తులసీరసంతో పాదరసంలాగా తారక బ్రహ్మమునందు మనస్సు నిలిచిపోయింది. రాతిని నాతిగా మార్చిన పాద సరోజములందు ఆయన మనస్సు నిలిచిపోయింది. మనో ఇంద్రియము సత్య స్వరూపమును పొందినది. మునుల హృదయముల యందు ప్రకాశించిన తాపస మందారుని యందు త్యాగయ్య మనస్సు కరుడుకట్టిపోయింది. ఆ తారక పరబ్రహ్మ రూపాన్నే పొందింది. ద్వైత దృష్టి హరించిపోయి, అభేద స్వరూపాన్ని పొందాడు.

- సశేషం

### పెదనిండ్రకొలను శాఖలో కార్యక్రమాలు

**అక్టోబర్ 2020**

1 గురు- అధిక ఆశ్వీయుజ పూర్ణిమ - శ్రీ సద్గురుపాదపూజ, భక్తసమారాధన.

12 సోమ - శ్రీగురుదశమి - శ్రీసద్గురుపాదపూజ.

17 శని - శ్రీదేవీ శరన్నవరాత్రులు ప్రారంభం.

21 బుధ - మూలా నక్షత్రం - సరస్వతీపూజ

23 శుక్ర - దుర్గాష్టమి

24 శని - మహర్నవమి

25 ఆది - విజయదశమి

31 శని - నిజ ఆశ్వీయుజ పౌర్ణమి - శ్రీసద్గురుపాదపూజ

**నవంబర్ 2020**

10 మంగళ - శ్రీగురుదశమి - శ్రీసద్గురుపాదపూజ.

14 శని - నరక చతుర్థశి , అమావాస్య - దీపావళి - శ్రీసద్గురుపాదపూజ

30 సోమ - కార్తీక పౌర్ణమి - (గురుపౌర్ణమి) - శ్రీసద్గురుపాదపూజ

# కైవల్యోపనిషత్

(గత సంచిక తరువాయి) - రేఖ

శ్రీగురుదేవులు బాబూజీ మహరాజ్‌వారు కూడా వారి దగ్గర ఎవరైనా, 'వారి మనసుకు కష్టం కలిగించేలాగా మాట్లాడారు' అనిచెప్పి బాధపడితే, 'నీ మనస్సు వారి మాటలను Accept ఒప్పుకున్నది కాబట్టే నీకా బాధ కలిగింది. ఆకాశానికి గుణం శబ్దం. భగవానుడు ఇచ్చిన కర్ణేంద్రియం ద్వారా నీకా శబ్దం వినబడుతోంది. విన్నది ప్రతిదీ నాది అని తీసుకోబట్టే , నీ మనసు దానిని Accept చేయబట్టే నీకు బాధ. బయట వాతావరణంలో మంచి చెడు రెండూ వున్నాయి. నీకు కావలసిన మంచినే తీసుకో. ఇతర శబ్దాలు పట్టించుకోకు. అలా చేసి, చేసి మనసులో స్టోర్ లాగా తయారు అవుతుంది.'

కానివి పోనివి కర్మముల్ చేసి కాలుని బారిన పడెదవేలరా - మనసు చేరితేనే కర్మ వస్తుంది. ఎలా అంటే మనం ఉదయం లేవగానే మనం రొటీన్‌గా అలవాటైపోయిన నిత్యనైమిత్తిక కర్మలు గబగబ మన ప్రమేయం లేకుండా చేసుకుంటూపోతాం కానీ రోజూ చేసేవి 'నేను చేస్తున్నాను' అని మనస్సు చేర్చి ఏ పనైనా, ఉపాసనైనా, అనుష్ఠానమైనా చేసుకుంటున్నామా? లేదు. అప్పుడది కర్మలో అకర్మ అయింది. అటువంటప్పుడు మనసు ప్రార్థనలో పూజలో కూర్చున్నా హాయిగా భగవంతుని యందు నిలుస్తుంది. మనస్సు ప్రాపంచిక విషయాదుల యందు లేదు. అలా పనులు చేస్తూవుంటే ఆఖరికి భోజనం చేస్తున్నా, భగవంతుడిని తలచుకుంటూ ఆయన ప్రసాదంగా స్వీకరిస్తే అది కర్మే అయినప్పటికీ అకర్మ క్రిందే అవుతుంది. అంటే అక్కడ కర్తృత్వ భోక్తృత్వాలు లేవు. అలాగే మనం ఏమీ చేయకుండా ధ్యానానికి కూర్చుండగానే మనసు పరిపరి విధాలపోతూ తైతక్కలాడుతుంది. దాన్నేమన్నారు? అకర్మలో కర్మ అవుతుంది.

మనం చేసే సహవాసం మంచిదై వుండాలి. జాగ్రత్తవహించి సహవాసం, శ్రవణం చేయాలి. ఎందుకంటే మనం అలా వెడుతూ వుంటే, కావివీ పోనివీ ఎన్నో చెవిని పడతాయి. ఆ మనిషిలోని వాసనల వలన మనస్సు అటువైపు వెడుతుంది. వింటుంది. అది పెద్ద కర్మ అవుతుంది. మనిషి ఎదురులేకుండా కానివి, పోనివి ఎవరో మాట్లాడుతూ వుంటే వాటిని మనం వింటేచాలు. పెద్దకర్మ అయి కూర్చుంటుంది. ఎలా అంటే తెల్లని గోడకి నల్లని మసి అంటింది. పదిమంది ఆ గోడని రాసుకుంటూ

వెడితే కొన్నాళ్ళకి గోడ తెల్లబడి పోతుంది, ఆ మసి రాసుకుంటూ వెళ్ళిన వారి వీపుకి అంటుకుంటుంది. అసలు చేసినవాడికి తెలియకపోవచ్చు తాను చేసింది తప్పు అని. వాడికి ఏమీ కాకపోవచ్చు ఎందుకంటే మహాత్ముల సన్నిధిలో వున్నవాడు, అంతా ఆ భగవంతుడే చూసుకుంటాడు అనే విశ్వాసంతో వుంటూంటే వాడి జీవితం వెళ్ళిపోతుంది. ఆ చేసినపని ప్రపంచానికి దోషంగా అనిపించి నలుగురూ విమర్శిస్తే దాని తాలుకు మసి వీళ్ళకి అంటుకుంటుంది. ఒక్కడికి అంటుకోవలసిన దోషం నలుగురు పంచుకుంటున్నారు, అనుభవిస్తున్నారు. దానికి శాస్త్రం ఇలా చెప్పింది ...

**కర్తా కారయతాచైవ ప్రేరకశ్చానుమోదకః।**
**సుకృతం దుష్కృతం చైవ చత్వార స్సమభాగినః॥**

మంచి కాని, చెడు కాని నువ్వు పంచుకుంటే ఆ కర్మ నువ్వు అనుభవిస్తావు. ఇలా చేసి కాలుని బారిని పడెదవేలరా అని మహాత్ములు అంటున్నారు. ప్రపంచంలో వుంటూ ఇది అవసరమా లేక అనవసరమా అనే వివేక దృష్టిని కలిగి వుండాలి.

మనం శాంతి మంత్రాలు చదివినప్పుడు చివరికి ఓం శాంతిః ఓం శాంతిః ఓం శాంతిః అని మూడుసార్లు అంటాము. ఆధ్యాత్మిక, ఆధిభౌతిక , ఆధిదైవిక తాపాల వలన కలిగే దుఃఖాలు ఉపశమించుగాక అని. వాటిల్లో ఆధ్యాత్మిక తాపానికి సంబంధించినది. ఎందుకంటే అది మనసుకు సంబంధించినది. మనస్సు ఆలోచించి విమర్శగా వాక్కురూపంలో నలుగురితో పంచుకుని (మంచి అయితే ఫరవాలేదు) ఆ చెడు కర్మను మూటకట్టుకుని విలువైన మన కాలాన్ని దుర్వినియోగం చేస్తున్నాము. మన ఆయుష్షు తరిగిపోతుంది. ధనం పోయినా మళ్ళీ సంపాదించగలం. కానీ గడచిన కాలాన్ని మళ్ళీ వెనక్కి తీసుకురాలేము. మన ఆయుఃకాలంలో అంత కాలం దుర్వినియోగం అయిపోతుంది. ఇప్పటి నుండి అయినా మనకున్న సమయాన్ని సద్వినియోగ పరచుకుంటే, మంచిని ఆలోచిస్తే భగవంతుడు ఆ సమయం మనకి దాచిపెడతాడు. ఆయన పాదాల దగ్గర వుంటుంది. ఆయన దగ్గర మన బాధ్యత అనవసరమైన విషయాల వ్యామోహంలో, కదలికలలోపడి కాలునిబారిన పడెదవేలరా అని చెబుతూ కాళీప్రసాదుని హృదయ నివాసి అయిన శ్రీమన్నారాయణ పాద ధ్యానం, స్మరణం మరవవద్దు అని హెచ్చరిక చేస్తున్నారు. ఇది పాప హరణ చేస్తుంది.

- సశేషం

# శ్రీ కాళీగార్డెన్స్ ఆశ్రమంలో కార్యక్రమాలు

**అక్టోబర్ 2020**

1 గురు - అధిక ఆశ్వీయుజ పూర్ణిమ. శ్రీసద్గురు పాదపూజ.

12 సోమ - శ్రీగురు దశమి. సత్సంగం, శ్రీ సద్గురుపాదపూజ.

15 గురు - మాస శివరాత్రి.

16 శుక్ర - అమావాస్య

17 శని - శ్రీ శరన్నవరాత్రి ప్రారంభం. ఉదయం 7-45 ని॥ అంకురార్పణ.

21బుధ - మూలా నక్షత్రం - సరస్వతీపూజ

24 శని - దుర్గాష్టమి మరియు మహర్నవమి. సామూహిక కుంకుమ పూజలు

25 ఆది - విజయదశమి

26 సోమ - ఏకాదశి - ఏకాహం, దీక్షావిరమణ. శ్రీ సద్గురుపాదపూజ.

31 శని - నిజ ఆశ్వీయుజ పౌర్ణమి - శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన. శ్రీమాతాజీవారి జన్మదిన మహోత్సవం.

**నవంబర్ 2020**

10 మంగళ - శ్రీగురుదశమి - సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ.

13 శుక్ర - మాసశివరాత్రి

14 శని - నరక చతుర్దశి - అమావాస్య - దీపావళి - సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన. రాత్రి 8గం.లకు టపాకాయలు కాల్చటం.

15 ఆది - ఆకాశదీప ప్రారంభం.

17 మంగళ నుండి 25 బుధ వరకు - ప్రతిరోజూ ఉదయం శ్రీరామలింగేశ్వర స్వామివారికి పంచామృతములు, నవరసాలతో ఏకాదశ రుద్రాభిషేకములు, లక్షబిల్వార్చన.

18 బుధ - నాగుల చవితి.

25 బుధ - చిలుక ఏకాదశి - శ్రీసద్గురు పాదపూజ. ఏకాహం సంకీర్తన. సామూహిక శ్రీసత్యనారాయణ స్వామి వారి వ్రతాలు. భక్తసమారాధన.

26 గురు - క్షీరాబ్ది ద్వాదశి - శ్రీసద్గురు పాదపూజ, భక్తసమారాధన.

28 శని - శనిత్రయోదశి.

29 ఆది - జ్వాలాతోరణం, శ్రీరామలింగేశ్వర స్వామి నగరోత్సవం.

30 సోమ -కార్తీక పౌర్ణమి - (గురుపౌర్ణమి) - సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన.

# గౌతమ మహర్షి

- రమణ ప్రసాద్

గౌతమ మహర్షి బ్రహ్మ మానస పుత్రులలో ఒకడు. గౌతమ ధర్మసూత్ర కర్త. విష్ణుమూర్తి మోహినీరూపం ధరించి త్రినేత్రుడిని సురాసురులను మోహింప చేయగా బ్రహ్మ సృష్టి దీనికి ఏ పాటి సాటి? అని తలపోశారు. ఆ కారణంగా బ్రహ్మ అహల్య అనే మోహనాంగిని సృష్టించి తపస్సు చేస్తున్న గౌతమునికి పరిచర్య చేయమని ఆదేశించాడు.

అహల్య గౌతమునికి హోమాదికృత్యాలలో సహాయ పడుతోంది. కొంతకాలానికి అహల్యకు యుక్త వయస్సు వచ్చింది. గౌతముడు ఆమెను తీసుకొనివెళ్ళి బ్రహ్మకి ఇచ్చాడు. బ్రహ్మ ఆమెను గౌతమునికి ఇచ్చి వివాహం చేయాలని ఉన్నా ఆమె త్రిలోకసుందరి అవటం చేత ఇంద్రాది దేవతలు 'మాకిమ్ము, మాకిమ్మ'ని బ్రహ్మను అడగటంతో 'ఎవరు భూప్రదక్షిణం చేసి ముందు వస్తారో అహల్యను వారికిచ్చి చేస్తాను'అని చెప్పాడు.

దేవతలు, ఋషులు భూప్రదక్షిణానికి బయల్దేరారు. గౌతముడు దగ్గరలోఉన్న గోమాతకు ప్రదక్షణ చేశాడు. శృతివాక్యం ప్రకారం అది భూప్రదక్షిణానికి సమానమవటం చేత మిగిలినవారు తిరిగి వచ్చేసరికి బ్రహ్మ అహల్యాగౌతములకు వైభవంగా వివాహం చేశాడు. ఇంద్రాది దేవతలు గౌతముని మాహాత్మ్యానికి మెచ్చి అహల్యా గౌతములను అభినందించి వెళ్ళిపోయారు.

అహల్యా సహితుడై దండక వనంలో బ్రహ్మదేవుని గురించి తపస్సు చేయగా, బ్రహ్మ వరం కోరుకోమనగా, గౌతముడు,"బ్రహ్మదేవా! నేను వేసిన విత్తనం జాములో పంటకు వచ్చునట్లు చేయమ'ని కోరగా, బ్రహ్మ ఆ వరాన్ని ప్రసాదించాడు. ఇలా ఉండగా అక్కడ క్షామం సంభవించి, పంటలు నశించి ప్రజలు ఆకలి బాధతో ప్రాణాలు కోల్పోతున్నారు. కొందరు శవాలనే తినటం మొదలు పెట్టారు. వారందరు గౌతముని ఆశ్రయించారు. గౌతముడు అహల్యతో కలిసి తన తపశ్శక్తి చేత అందరికి అన్న వస్త్రములనిచ్చి ఆదరించాడు. తండోపతండాలుగా జనులు భార్యాపుత్రులతో వచ్చి నివసించుటం మొదలు పెట్టడంతో గౌతముని ఆశ్రమం దినదినాభివృద్ధి పొంది గౌతముని కీర్తి ఇంద్రలోకానికి వ్యాపించింది. క్షణమైనా ఏమరకుండా అహల్యా గౌతములు అతిథి

సేవలో ఉన్నారు.

ఇలా ఉండగా విఘ్నేశ్వరుడు తల్లికి సవతి బాధ తొలగించటానికి గంగను భూమికి తేవాలని నిశ్చయించి, అది గౌతమ మహర్షికే సాధ్యమని బ్రాహ్మణ వేషంలో గౌతముని ఆశ్రమానికి వచ్చాడు. పార్వతి యొక్క చెలికత్తెను గోవురూపం ధరించమని చెప్పి,"గౌతముడు ఏది చేసినా వెంటనే చనిపొమ్మ"ని చెప్పాడు. గౌతముడు దానిమీద గరిక వేయగానే అది మరణించింది. అక్కడ బ్రాహ్మణులందరూ గోహత్యా పాతకుడని గౌతముని నిందించారు. గౌతముడు పాప విముక్తిని కోరగా బ్రాహ్మణవేషంలో ఉన్న విఘ్నేశ్వరుడు,"మీరు తపస్సు చేసి శివుని మెప్పించి, గంగా భవానిని ఇచ్చట ప్రవహింప చేస్తే నువ్వు త్రిలోకములలో పూజింపబడతావు" అని చెప్పాడు. గౌతముడు తపస్సు చేసి శివుని మెప్పించగా "శివుడు, గంగాదేవిని మాయాగోవు చనిపోయినచోట ప్రవహించేటట్ల చేయమని ఆదేశించగా, గంగ అనుగ్రహించి భూమిపై అవతరించింది. గౌతముని మూలమున అవతరించుట చేత 'గౌతమి' అని, గోవును ఉద్ధరించడం చేత 'గోదావరి' అని పేరు వచ్చింది.

అహల్య పతిసేవే మహాభాగ్యంగా భావించి గౌతముని సేవ చేస్తోంది. వారికి శతానందుడను కుమారుడు, అంజన అను కుమార్తె కలిగారు. శతానందుడు వెంటనే తపస్సు చేయటానికి తలి దండ్రుల ఆజ్ఞ తీసుకొని అడవికి వెళ్ళిపోయాడు. కాలాంతరాన అతడు శరద్వంతుడు అని పిలువబడుచు మహా తపస్సంపన్నుడయ్యాడు. అతనికి కృపి, కృపాచార్యుడు పుట్టారు. అంజన పుత్రుడే ఆంజనేయుడు.

- సశేషం

## శ్రద్ధాంజలి

శ్రీబాబు చిరకాల భక్తులు, ఆశ్రమ స్థిర నివాసులు అయిన సింగరాజు చిన నాగరాజుగారు (అన్నదానం) 9-9-2020 బుధవారం నాడు శ్రీసద్గురు సాయుజ్యం పొందారు. వీరి వయస్సు 75 సంవత్సరాలు. సద్గురుదేవులు వీరి ఆత్మకు శాంతిని ప్రసాదించెదరు గాక! వీరి కుటుంబ సభ్యులకు, బంధుమిత్రులకు మా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాము.

# డొక్కా సీతమ్మగారు

సేకరణ - మురళి

తూర్పుగోదావరి జిల్లా, మండపేట గ్రామంలో 1841వ సంవత్సరం, అక్టోబర్ రెండవ వారంలో సీతమ్మగారు జన్మించారు. తండ్రి భవానీ శంకరంగారు, తల్లి సీతమ్మగారు. ఆ రోజులలో స్త్రీలు విద్య నేర్చుకొనే అవకాశాలు అంతగా లేనందున ప్రాచీన సంప్రదాయాలకు బద్ధురాలై, తల్లిదండ్రులే గురువులై కథలు, గాథలు, పద్యాలు, పాటలు నేర్చారు. బాల్యంలోనే తల్లి మరణించడం వలన ఇల్లు చక్కదిద్దే భారం ఆమె మీదనే పడింది.

గోదావరి నదీ పరీవాహక ప్రాంతంలోని గ్రామాలను లంక గ్రామాలు అంటారు. వాటిలో లంక గన్నవరం ఒకటి. ఆ గ్రామంలోని డొక్కా జోగన్నగారు పెద్దరైతు, వేదపండితుడు కూడా. ఒకరోజు పండిత సభకు వెళ్ళి వస్తూ దారిలో శ్రీ భవానీ శంకరంగారి ఆతిథ్యాన్ని స్వీకరించారు. జోగన్నగారికి అతిథి మర్యాదలను చేయడంలో సీతమ్మగారు చూపించిన ఆదరాభిమానాలకు, గౌరవ మర్యాదలకు, వినయ విధేయతలకు పరమానంద భరితులై సీతమ్మను వివాహం చేసుకున్నారు. అప్పటి నుండి ఆమె డొక్కా సీతమ్మగా పేరుగాంచారు. ఆమెకు వయస్సుతోపాటు ఉదార గుణం కూడా నానాటికి పెంపొంద సాగింది. జోగన్న సీతమ్మగార్ల దాంపత్యం అన్యోన్యమైనది. ఆ పుణ్య దంపతులను చూసి ఆనందించనివారు లేరని చెబుతుండేవారు. శుచీశుభ్రతలతోపాటు ఆప్యాయత ఆదరణలకు వారి యిల్లు పెట్టింది పేరు.

ఆ ప్రాంతంలో తరచు వచ్చే వరద కారణంగాను, అతివృష్టి అనావృష్టిల కారణంగాను పలు ఇబ్బందులకు గురి అయ్యే ఆ ప్రాంత గ్రామాల పేదలను ఆదుకుంటూ, వచ్చినవారికి లేదనకుండా నిత్యాన్నదానం జరిపిన మహా ఇల్లాలు. చదువు సంధ్యలు లేని సాధారణ స్త్రీ అయినప్పటికీ ఆమె చేసిన అన్నదానం విశ్వమానవతకు అద్దం పట్టింది. భారతీయ సంప్రదాయం వరకు అన్నదానానికి మించిన దానం లేదని విశ్వసించి, ఆకలిగొన్నవారి ఆకలి తీర్చడమే ధ్యేయంగా 'అతిథి దేవోభవ!' అన్న పదానికి ఉదాహరణగా నిలిచిన వ్యక్తి ఆమె.

బ్రిటీష్ ప్రభుత్వం వారు సీతమ్మగారి సేవా నిరతిని గుర్తించి కింగ్ ఎడ్వర్డ్ -VII ఆమెను సత్కరించుటకు ఆహ్వానించగా తను ప్రచారం కొరకు చేయుటలేదని, సేవా భావంతో చేస్తున్నానని చెప్పి, సున్నితంగా తిరస్కరించారు. తన భర్త మరణానంతరము కూడా అన్నదానమును కొనసాగించి చివరికి తమ ఆస్తి అంతా కరిగిపోయినా, అన్నదానం మానలేదు. సుమారు నలభై సంవత్సరములు అన్నదానం చేసుకుని, చివరకు 1909వ సంవత్సరంలో పరమపదించారు.

## ఎన్నేళ్ళుంటామో

- పెనుమాక నాగేశ్వరరావు

ఎన్నేళ్ళుంటామో ఎన్నాళ్ళుంటామో
ఎట్లాగుంటామో ఎట్లా వెళ్తామో
చెట్లకు పుట్లకు మొక్కేస్తుంటాం
మెట్లను గట్లను ఎక్కేస్తుంటాం

పడుతూ లేస్తూ పయనిస్తుంటాం
తింటూ తిరుగుతూ బ్రతికేస్తుంటాం
మా కష్టాలను మీరే కాస్తారనుకుంటుంటాం
కాలానికి ఖర్మానికి వదిలేస్తుంటాం

కాలమనే గాలానికి చిక్కేస్తుంటాం
భారమంతా మీపైనే మోపేస్తుంటాం
చిటారు కొమ్మన మిఠాయి పొట్లాం వుందనుకుంటాం
చివరాఖరికేమేమో అయిపోతుంటాం

# సమర్థ సద్గురు నాథుని దివ్య చరిత్ర

## శ్రీహరిరావు గారితో శ్రీబాబు

- కీ.శే. విజయేశ్వరానంద ప్రసాద్

31-5-1959: ఏలూరులో శ్రీహరిగారింటికి వస్తూనే "12 వందల మైళ్ళ దూరం వెళ్ళి వచ్చా"నని శ్రీ బాబు చెప్పారు. కాఫీ యివ్వమన్నారు. తీసుకుంటూ "ఇచ్చే వాణ్ణీ నేనే. పుచ్చుకునే వాణ్ణీ నేనే. నేనే అడిగి తీసుకుంటాను. ఎవరో చుట్టాలైతే మొహమాటం గాని మనింట్లో మనకి సిగ్గేమిటి?" అన్నారు. తాము ప్రయాణం చేసిన దాంట్లో సగం దూరానికి రైలు టికెట్టు ఖరీదు 97-35 రూ. (ఆ రోజుల్లో) అని టికెట్టు నెంబరు నోట్ చేసుకున్న కాగితం చూపించి, తరువాత చింపేశారు. "కారు మీద బెజవాడకు బయలుదేరితే, డ్రైవరు కారు యిటు తీసుకు వచ్చి, యీ సందులో యిక్కడ ఆపి, 'మీరు యిక్కడే దిగాలి, లేకపోతే వీలులేద"న్నాడు. "ఓహో! ఇక్కడ ఉన్న హృదయాల ఆకర్షణ శక్తి అంత గొప్పదన్న మాట. దిగక తప్పుతుందా అనుకున్నాను" అన్నారు.



9-6-1959: మంగళవారం మధ్యాహ్నం మూడు గంటలకి ఏలూరులో శ్రీహరిగారి యింటికి వచ్చి కూర్చున్నారు. ఎదురుగా కాలెండరులో అర్జునునికి రథ సారథ్యం చేస్తున్న కృష్ణుణ్ణి చూసి "చాలా బాగుంది. ఆ రథం ఎంత అందంగా ఉంది! (అదే మానవ దేహం). దానికున్న నాలుగు గుర్రాలు ఎంతో సాత్త్వికంగా ఉన్నాయి(మనో, బుద్ధి, చిత్త ,అహంకారాలు). ఇక రథ సారథిని చూడండి! ఎంత చాకచక్యంగా నడిపిస్తున్నాడో! (శ్రీ కృష్ణ పరమాత్మ). అయితే, ఆ యుగంలో, ఆ కాలంలో వాళ్ళు యిలా ఉంటారని ఊహించి చిత్రించారా చిత్రకారులు? లేక వాళ్ళను చూసిన వారు చిత్రించారా? లేక వ్రాశారా? ఈ శాస్త్రాలూ యివన్నీ కూడా ఎవరో వ్రాసినవేనా?" అన్నారు శ్రీ బాబు. "ఇంటికి వెళ్ళి షర్టు విప్పేస్తే ఎంతో హాయిగా ఉంటుంది. కానీ లోకం కోసం యిది వేసుకోవటం తప్పదు. ఎందుకంటే యిది వేసుకుంటే మనని లోకం గుర్తించకుండా తప్పించుకోవచ్చును. మనని చాలా మంది

గ్రహించకుండా, అలా గుప్తంగా, వీలైనంత రహస్యంగా ఉండాలనే మా ప్రయత్నం. మేమే తలచుకుంటే , అందరినీ..(ఆగిపోయి), కాని ఎవరినీ అలా చెయ్యం" అన్నారు.

11-6-1959: గురువారం. శ్రీ బాబు నరసాపురం వెళ్ళి విశ్వనాధం, కనకమ్మ దంపతులకు దర్శనం ప్రసాదించి, వారింట్లో దేవతార్చనను వుంచి ముంజవరపుకొట్టు వెళ్ళారు. అక్కడ భక్తులు శ్రీసద్గురు పాదపూజ చేసుకున్నారు.

ఇక్కడ నరసాపురంలో శ్రీ బాబు ప్రియభక్తుడు విశ్వనాధంగారు ఆ రాత్రే దేహం చాలించారు. దు:ఖావేశంలో కనకమ్మగారు భర్త మృత దేహాన్ని యింట్లోనే విడిచి యిల్లు తాళం వేసి కారులో పుట్టింటికి వెళ్ళారు. మరునాడు(12-6-1959) శుక్రవారం శ్రీ బాబు శేషగిరిరావుగారితో నరసాపురం వచ్చేసరికి యిది పరిస్థితి. శ్రీ బాబు వారి గుమ్మంలోనే కూర్చుండి పోయి పసిపిల్లవాని వలె దు:ఖించారు. శేషగిరిరావుగారు శ్రీ బాబును భీమవరం చేర్చి, తాము కనకమ్మగారి పుట్టింటికి వెళ్ళి తాళపు చెవులు తెచ్చి, కనకమ్మగారింట్లో ఆ రోజంతా పూజ లేకుండా వుండిపోయిన 'అమ్మ'ను(శ్రీ బాబు దేవతార్చన పెట్టెను) భీమవరం తీసుకు వచ్చారు. 'అమ్మ' పూజ చేసుకునే వరకు శ్రీబాబు మంచి నీరైనా తీసుకోలేదు. పరమ భక్తులైన విశ్వనాధంగారి మరణంతో శ్రీ బాబు విచలితులైపోయారు. కొన్ని రోజులకు గాని కోలుకోలేకపోయారు.

11-7-1959: భీమవరంలో ప్రతి రోజు సంకీర్తన, తీర్థ ప్రసాదాలు, వుపన్యాసాలు ఉండేవి. 'ఉండి'లో స్వామి మకాము. 'అమ్మ' ఎరుపు రంగు చీర కట్టుకుంటుందని, అందుకని తమకు ఎరుపు రంగంటే చాల యిష్టమని చెప్పారు. మందార, తామర, తెల్ల గన్నేరు పూలంటే కూడ 'అమ్మ'కిష్టమని చెప్పారు. "అమ్మ" సాక్షాత్కారం పొందిన కొత్తల్లో ఎక్కడ చూసినా సర్వమూ 'అమ్మ' మయంగా కనిపించేది. కాళ్ళలో, చేతుల్లో, నేలమీద, నడిచి వచ్చే వాళ్ళలో, నమస్కరించే వాళ్ళలో అంతటా 'అమ్మే' కనిపించేది. నాకే నాలుగు చేతులు, కత్తీ, ఆయుధాలు ఉన్నట్లు కనపడేది" అని శ్రీ బాబు చెప్పారు. "రామకృష్ణ పరమహంస గురువుగారు తోతాపురి. మా శేషగిరి 'తూటాపురి' అని శ్రీ బాబు ఒకటే నవ్వు.

-సశేషం




# శ్రీరామానుజులు

-రమణ ప్రసాద్

శ్రీరామానుజుల వారి బ్రహ్మసూత్ర వ్యాఖ్యానం "శ్రీభాష్యం"గా ప్రసిద్ధి చెందింది. శ్రీరామానుజులు తన బ్రహ్మసూత్రాలకు వ్యాఖ్యానంలో బోధాయనస బ్రహ్మసూత్ర వృత్తిని అనుసరించానని తెలిపారు. వీరి ఇతర ముఖ్యగ్రంధాలు, భగవద్గీతా వ్యాఖ్యానం, వేదాంతదీపం, వేదాంత సారం, వేదాంత సంగ్రహం అనే గద్యత్రయం. విశిష్టాద్వైతం బోధించే చరమసత్యాలు మూడు. వీటిని "తత్త్వత్రయం" అంటారు. ఒకటి భగవంతుడు, రెండు జీవుడు (చిత్), మూడు జడపదార్థం (అచిత్). ఈ మూడింటిలో భగవంతుడు ఒక్కడే సర్వస్వతంత్రుడు. మిగిలిన రెండూ భగంతునిపై ఆధారపడి ఉన్నాయి. జీవుడికి, శరీరానికి ఎటువంటి సంబంధం ఉన్నదో, భగంతుడికీ – జీవుడికీ, భగవంతుడికి– జడపదార్థానికి అటువంటి సంబంధమే ఉన్నది. అంటే శరీరం జీవుడిపై ఆధారపడినట్లు, జీవ శరీరాలు రెండూ భగవంతుడిపై ఆధారపడి ఉన్నాయి. జీవుడు, ప్రకృతి భగవంతుని కంటే విలక్షణంగా కనిపిస్తున్నా అవి భగవంతుడికి వేరుగా లేవు. జీవప్రకృతులను శాసించేది బాహ్య సంబంధంకాదు. అభిన్నతారూపమైన అంతర్ సంబంధమే. దీనినే "అపృథక్ సిద్ధి" అని అంటారు. విశిష్టాద్వైత దర్శనం అపృథక్ సిద్ధి అనే ఇరుసుపైనే తిరుగుతూ ఉంటుంది.



విశిష్టాద్వైత సిద్ధాంతంలో భగవంతుడు నారాయణుడుగా పేర్కొన బడ్డాడు. ఉపనిషత్తులు పరబ్రహ్మాన్ని వర్ణించినట్లు నారాయణుడిని సత్యశివరూపంగా, సకల

కళ్యాణ గుణాకారునిగా, విష్ణువుగా విశిష్టాద్వైతం వర్ణించింది. ఆ విష్ణువే సకలానికీ ఆధారం. సకలాన్నీ నియమించే నియంత. అంతేకాదు సకలజీవుల చరమలక్ష్యం కూడా ఈ నారాయణుడే.

శ్రీరామానుజుడు తన సిద్ధాంతానికి జీవకర్రగా బృహదారణ్యకో పనిషత్తులోని ఈ క్రింది వాక్యాలను ఆధారంగా తీసుకున్నారు.

“ఎవడు విశ్వమందునివసిస్తున్నాడో, విశ్వంలోపల ఉన్నాడో, ఎవడిని ప్రపంచం ఎరుగదో, ఎవడి శరీరం ఈ విశ్వమో, ఎవడు లోపల నుండి ఈ విశ్వాన్ని నియమిస్తున్నాడో అతడే ఆత్మ” అతడే అంతర్యామి, అతడే అమృతుడు.”

భగవంతుడే ఈ ప్రపంచానికి సంపూర్ణ ఏకైక కారణం. అయినా ప్రపంచ పరిణామాలు భగవంతుడిని తాకలేవు. భగవంతుడు ప్రపంచానికి అతీతంగా ఎలా ఉన్నాడో, అలాగే దాని లోపల కూడా అంతర్యామిగా ఉన్నాడు. అతడే సర్వోన్నత ధర్మ సంస్థాపకుడు. నీతి నియమ విధాయకుడు. దారి తప్పిన జీవులను తిరిగి తనలోకి చేర్చుకోవటానికి ఆయనే స్వయంగా శరీరం ధరించి యుగయుగాలలోను అవతరిస్తూఉంటాడు. దివ్యక్షేత్రాలలో దేవతా విగ్రహరూపాలలో కూడా ఆయన దర్శనం ఇచ్చి అనుగ్రహిస్తూ ఉంటాడు.

ఈ జడమైన ప్రపంచం జీవులకు నివాసస్థలమైనట్లే భగవంతునికి కూడా నివాసమై ఉన్నది. ప్రకృతి మూడు గుణాలు కలిగి ఉంది. సత్వము, రజస్సు, తమస్సు. ఈ మూడూ ప్రపంచ సమయంలో వ్యక్తమవుతాయి. ప్రళయకాలంలో సూక్ష్మరూపంలో ఉంటాయి. అంతే కాని ప్రకృతికి ఎప్పటికి నాశనం లేదు. శూన్యం నుంచి ఏదీ రాదు కదా! కాలం జడం అయినా సర్వజగత్తురూపంగా ఉంది. సర్వజగత్తు యొక్క సత్తా భగవంతుడు మాత్రమే.

-సశేషం

Printed, and Published by C.V. Ramana Babu, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - PALURI SIVA RAMA KALI PRASAD